జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 22 పక్షపత్రిక నవంబర్ 16-30, 2012



# సురాజ్యం కోసం విద్యార్థులు








దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని లోక్‌సత్తా పార్టీ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో
అవినీతి, వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా అవినీతి నరకాసురుడిని దహనం చేస్తున్న
లోక్‌సత్తా అధినేత, ఎమ్మెల్యే డా॥ జయప్రకాష్ నారాయణ్



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక నవంబర్ 16-30, 2012

సంపుటి - 3 సంచిక - 22

## లోపలి పేజీల్లో...

సురాజ్య ఉద్యమం తక్షణ కార్యక్రమాలు........... 5

ప్రజా మున్సిపల్ కౌన్సిళ్లను ఏర్పాటు చెయ్యండి.. 6

గాంధేయవాది మూర్తిరాజు ఇక లేరు............. 9

ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణాలకు కళ 10

జన్యుమార్పిడి పంటల పరీక్షలపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన లోక్‌సత్తా.... 13

ఉన్నత విద్యకోసం 'రూసా'......................... 14

నిర్దేశిత లక్ష్యాల దిశగా 'కాప్'-11................ 16

జీవ వైవిధ్య పరిరక్షణ దిశగా హైదరాబాద్ డిక్లరేషన్............................................ 18

నిత్యజీవితంలో కవిత్వం........................... 20

లోక్‌సత్తా పార్టీలో సభ్యులుగా చేరండి......... 22

పట్టణాలలో సురాజ్యం నగరా...................... 24

## సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం

జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# ఎదురుదాడి రాజకీయం

## సంపాదకీయం

'ఎలా బతుకుదునే అమ్మా అంటే నోరెట్టుకు బతకవే బిడ్డా' అన్నది సామెత. ప్రస్తుతం దేశంలో రాష్ట్రంలో సాగుతున్న ఎదురుదాడి రాజకీయానికి మూలం ఈ సామెతలో వున్నట్టు కనిపిస్తుంది. విధానాల మధ్య సంఘర్షణకి రాజకీయ పార్టీలు చాలా సంవత్సరాల కిందటే చెల్లు చీటి రాసేశాయి. దీనిని పార్టీల మధ్య సంఘర్షణగా ఆ తర్వాత వ్యక్తుల మధ్య సంఘర్షణగా, చివరికి ఎదుట వారి బలహీనతల మీద సంఘర్షణగా, అంతిమంగా ధనబలం చుట్టూ, ప్రలోభాల చుట్టూ సంఘర్షణగా మార్చేశాయి. పదవీ కాంక్ష రాజకీయం అయినప్పుడు అవినీతే రాజకీయానికి అంతఃసూత్రం అయినప్పుడు ఇంతకంటే మంచి పరిణామాలు రాజకీయాలలో రూపుదిద్దుకోవు.

ఇంతవరకు ప్రతిపక్షంలో వున్న అసహనం ఇప్పుడు అధికార పక్షాలలోనూ, స్పష్టంగా కనిపిస్తున్నది. అటు పార్లమెంటులో, ఇటు బహిరంగసభలలో సోనియా గాంధీ అసహనం దీనికి అద్దం పడుతుంది. పార్లమెంటులో ఆమె ప్రతిపక్షాల మీద విరుచుకుపడ్డారు. ఇటీవల రామలీలా మైదానంలో సభ పెట్టి ఇలాంటి ఎదురుదాడిని ప్రత్యక్షంగా సాగించారు. ఇది వీరికే పరిమితమైంది కాదు. ప్రతిపక్షంలో వున్న బి.జె.పి. పార్లమెంటును స్తంభింపజెయ్యడం, తమ ప్రభుత్వాలపై వచ్చిన అవినీతి ఆరోపణలను చక్కదిద్దుకోడానికి బదులు ఎదురుదాడి రాజకీయమే అస్త్రంగా వినియోగించింది.

గడ్కరీ మీద ఆరోపణలొస్తే వాద్ర మీద ఆరోపణలతో ఎదుర్కొనే నీతిని వారు పాటిస్తే, వాద్రా మీద ఆరోపణలను తిప్పి కొట్టడానికి గడ్కరీని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. రామలీల మైదానంలో సోనియా మాట్లాడుతూ మా చుట్టూ గోతులు తీసేవాళ్ళే ఇప్పుడు నూతిలో పడ్డారని ఎద్దేవా చేశారు. మొత్తం మీద ఒకరు గోతిలో, ఒకరు నూతిలో పడి దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు. నువ్వేం సాధించావంటే, నువ్వేం సాధించావో చెప్పు అంటూ ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు. ఇలా ఒకళ్ళ మీద ఒకళ్లు దుమ్మెత్తి పోసుకుంటూ ప్రజల కళ్లలో దుమ్ముకొడుతున్నారు.

దేశంలో పరిస్థితి ఇలా వుంటే రాష్ట్రంలో పరిస్థితి దానికి నమూనాగానే వుంది. స్వయంగా ముఖ్యమంత్రి అధికార కార్యక్రమాలను ప్రతిపక్షం మీద దాడికి వినియోగిస్తున్నారు. వ్యక్తిగత ఆరోపణలు గుప్పిస్తున్నారు. మరోపక్క చంద్రబాబు పాదయాత్రలో తన క్షోభ వెళ్ల బుచ్చుకుంటూనే అందరి మీద విరుచుకుపడుతున్నారు. ఒకపక్క తాయిలాల పంట పండిస్తూ నోటికి తాళం లేకుండా మాట్లాడుతున్నారు. తేదేపా నేత పాదయాత్రకు పోటీగా వైకాపా పాదయాత్ర ఆద్యంతం ఇలాంటి ఎదురు దాడితోనే సాగుతోంది. గురివింద పూస చందంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఇక ఇప్పుడే మేల్కొన్న కే.సి.ఆర్. అందరికీ డెత్ లైన్స్ పంపిస్తున్నారు. ఇలా రాజకీయం 'మాటల గారడీగా చేతల పేరడీ'గా మారింది. ఇలాంటి రాజకీయ సంఘర్షణ పార్టీలకు ఎంత మేలు చేస్తుందో తెలియదు గాని దేశానికి రాష్టానికి మాత్రం కీడు చేస్తుంది. ●




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034*

*ఫోన్ నంబర్లు :*
***040- 23311817, 23311819, 23311820, 23312829***
***ఫ్యాక్స్ : 040-23310612***
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311817**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# సురాజ్య ఉద్యమం
# తక్షణ కార్యక్రమాలు

## 2012 నవంబరు 16న హైదరాబాద్ జరిగిన రాష్ట్ర సారధ్యసంఘం సమావేశ నిర్ణయాలు

1. సురాజ్య ఉద్యమం వివిధ పట్టణాలకు రౌండ్‌టేబుల్స్ రూపంలో విస్తరించింది. దాదాపు 90 పట్టణాలు / నగర ప్రాంతాలలో రౌండ్‌టేబుల్స్ జరిగాయి. ఇందులో ఆయా పట్టణాల ప్రముఖులు, వివిధ పార్టీల ప్రతినిధులు విద్యాసంస్థలు, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం మీద ఈ రౌండ్‌టేబుల్స్‌లో 10,000 మంది పాల్గొని ఈ ఉద్యమంలో భాగస్వాములమౌతామని ప్రకటించారు.

ఆ తర్వాత అనేక విద్యాసంస్థలలో విద్యార్థులకు అవగాహన కల్పించడానికి సమావేశాలు, చర్చాగోష్ఠులు సాగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 50,000 మంది విద్యార్థులకు సురాజ్య సందేశాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే మన ఊళ్లో సురాజ్యం పేరుతో పట్టణాలలో ప్రజా మున్సిపల్ కౌన్సిల్స్ ఏర్పాటు ప్రారంభం అయింది. ఈ నేపథ్యంలో సురాజ్య ఉద్యమ భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకోవాలి. ముందుగా ప్రకటించిన విధంగా ఆగస్టు 9న ప్రారంభమైన ఈ ఉద్యమం డిసెంబరు9 తో తొలిదశ ముగుస్తుంది.

**1. తక్షణ కార్యక్రమాలు :**

ఎ) అన్ని పట్టణాలలో ప్రజామున్సిపల్ కౌన్సిల్స్ ఏర్పాటును త్వరితం చెయ్యాలి. నవంబరు నెలాఖరులోగా వాటిని పూర్తిచెయ్యాలి.

బి) విద్యార్థులలో మంచి స్పందన కనిపిస్తున్నది. అందుచేత వివిధ కళాశాలల్లో సభలు, సమావేశాలు, చర్చాగోష్ఠులు కొనసాగించాలి.

**2. డిమాండ్స్ ప్రకటన :** సురాజ్య ఉద్యమ తక్షణ డిమాండ్స్‌ను రూపొందించి నవంబరు 27వ తేదీన ప్రకటించటం జరుగుతుంది. తర్వాత ప్రభుత్వానికి ఒక మెమోరాండం ఇవ్వడం జరుగుతుంది. పట్టణాలలో ఈ డిమాండ్లపై ప్రచారాన్ని ఉధృతం చెయ్యాలి.

**3. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేకదినం - సురాజ్యం మార్చ్**

డిసెంబరు 9 అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా సురాజ్యం కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చెయ్యాలి. డిసెంబర్ 9, 8 తేదీలు ఆదివారం, రెండవ శనివారం సెలవులు అయినందున పట్టణస్థాయిలో అన్ని విద్యాసంస్థలతో సంప్రదించి ఆయా పట్టణాలలో తేదీలను నిర్ణయించుకోవాలి. డిసెంబరు 5,6,7 తేదీలలో అన్ని పట్టణాలలో వేలసంఖ్యలో విద్యార్థులతో, పుర ప్రముఖులతో, స్వచ్ఛంద సంస్థలతో సురాజ్యం మార్చ్‌లను నిర్వహించాలి.

**4. మూడు రోజుల నిరాహార దీక్షలు :** సురాజ్యఉద్యమ తక్షణ డిమాండ్స్ విస్తృతప్రచారం కల్పించడానికి ప్రజలందరి దృష్టిని సురాజ్యఉద్యమం వైపు ఆకర్షించడానికి తొలిదశ ఉద్యమానికి తగిన ముగింపు ఇవ్వడానికి వీలుగా డిసెంబరు 5-7 తేదీల మధ్య మూడురోజులపాటు హైదరాబాద్‌లో నిరాహార దీక్షలు జరుగుతాయి. హైదరాబాద్‌లో రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఇతర ప్రముఖులు పాల్గొంటారు. వివిధ పట్టణాలలో నిరాహార దీక్షలు, ధర్నాలు, సురాజ్య శిబిరాల రూపంలో మద్దతు కార్యక్రమాలు నిర్వహించాలి.

**5. కొనసాగింపు కార్యక్రమాలు : డిసెంబరు 9 తర్వాత**

ఎ) సురాజ్య ఉద్యమాన్ని పట్టణాలలో ఏర్పడిన ప్రజామున్సిపల్ కౌన్సిల్స్ కార్యకలాపాల రూపంలో కొనసాగించాలి. సురాజ్య ఉద్యమ లక్ష్యాలను ప్రచారం చెయ్యడానికి, పట్టణ ప్రజల తక్షణ సమస్యలపై స్పందించడానికి, పట్టణ సమగ్రాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఈ ప్రజాకౌన్సిల్స్‌ను వేదిక చేసుకోవాలి. సురాజ్య ఉద్యమం లో భాగస్వాములైన వారందరికీ ఇదొక నిత్య కార్యక్రమం అవుతుంది.

బి) సురాజ్య వలంటీర్ల నమోదును కొనసాగించాలి. వారికి ఉద్యమంపై అవగాహన కల్పించాలి. దీర్ఘకాలం ఉద్యమాన్ని సాగించడానికి తగిన బృందంగా వీరిని తీర్చిదిద్దాలి.

ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాల్సిందిగా పట్టణ సురాజ్య ఉద్యమ కమిటీలకు, విద్యాసంస్థలకు, విద్యార్థులకు, స్వచ్ఛంద సంస్థలకు భాగస్వాములైన ప్రముఖులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. ●

# ప్రజా మున్సిపల్ కౌన్సిళ్లను ఏర్పాటు చెయ్యండి

## కార్యక్రమాల నిర్వహణకు కొన్ని మార్గదర్శకాలు

### I 1. ప్రజా మున్సిపల్ కౌన్సిల్ ఏర్పాటు

ప్రస్తుతం మున్సిపాలిటీలలో ప్రజాప్రతినిధుల పాలన లేదు. ఎన్నికలు ఇప్పుడు జరిగే అవకాశమూ లేదు. ప్రజా సమస్యలు పట్టించుకునే ప్రజాప్రతినిధులు లేనందున సురాజ్య కమిటీ చొరవ తీసుకుని ప్రజా మున్సిపల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చెయ్యాలి.

**ప్రజా మున్సిపల్ కౌన్సిల్ ఛైర్మన్ మరియు అధ్యక్షవర్గం**

– సురాజ్య ఉద్యమ కమిటీ సమావేశమై ప్రజా మున్సిపల్ కౌన్సిల్‌కు ఒక ఛైర్మన్‌తో పాటు అధ్యక్ష వర్గానికి పట్టణ సురాజ్య ఉద్యమ కమిటీ అధ్యక్షులతో పాటు మరో నలుగురైదుగురు పెద్దలను గుర్తించి, వారితో సంప్రదించి తుది జాబితాను రూపొందించుకోవాలి. ఇందులో మహిళలకు, ఇతర తరగతులకు ప్రాతినిధ్యం వుండేలా చూడండి.

**ఆహ్వానిత సభ్యులు :** ఈ ప్రజాకౌన్సిలుకు మాజీ మున్సిపల్ ఛైర్మన్‌లను, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను మాజీ మున్సిపల్ కమిషనర్లు లేదా ఇంజనీర్లు, మేనేజర్ల వంటి వారిని ఆహ్వానిత సభ్యులుగా పెట్టుకోవాలి.

**ప్రజాకౌన్సిలర్లు :** ప్రతి వార్డుకీ ఇద్దరు సభ్యులు అందులో ఒకరు మహిళ వుండేలా ప్రజా కౌన్సిలర్లను ఏర్పాటు చేసుకోవాలి. ఆయా వార్డులలో స్థానిక సమస్యల మీద కృషి చేస్తున్న వారు, లేదా పని చెయ్యాలన్న ఆసక్తి గలవారి నుండి ఎంపిక చెయ్యాలి.

**ప్రజాగేలరీ :** మున్సిపల్ వ్యవహారాలలో ఆసక్తిగల వారిని వివిధ రంగాల ప్రతినిధుల్ని ప్రతి సమావేశానికి ప్రజాగేలరీకి ఆహ్వానితులుగా పిలుచుకోవాలి.

ప్రజాకౌన్సిల్ ఏర్పాటు తేదీని, ప్రదేశాన్ని ముందుగా నిర్ణయించి కరపత్రం ద్వారా ప్రచారం చేసి, అందరికీ ఆహ్వానాలు పంపి తొలి ప్రజాకౌన్సిల్ సమావేశం నిర్వహించి లాంఛనంగా ఈ ప్రజా మున్సిపల్ కౌన్సిల్ పేర్లు ప్రకటించాలి. ఈ ప్రజాకౌన్సిల్ బృందాన్ని రాజకీయాలకి అతీతంగా ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న లేదా ఆసక్తిగల వారితో ఏర్పాటు చెయ్యాలి.

### 2 . ప్రజా మున్సిపల్ కౌన్సిలు నిర్వహించే కార్యకలాపాలు

1. ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం కావాలి.

ఉదా: ప్రతినెలా 1-15 తేదీలు లేదా మరొక తేదీలు నిర్దిష్టంగా నిర్ణయించి ప్రకటించాలి.

2. ప్రతి సమావేశంలో కనీసం ఈ క్రింది మూడు అంశాలతో ఎజెండాను రూపొందించుకోవాలి.

1. మున్సిపాలిటీల సాధికారత సమస్యలు (74 రాజ్యాంగ సవరణలోని ఒక అంశంపై వివరణ – చర్చ)
2. మన ఊళ్లో వసతులు, మానవాభివృద్ధి, సిటిజన్స్ ఛార్టర్లలో ఏదో ఒక అంశంపై నివేదిక – చర్చ
3. ప్రజా కౌన్సిలర్లు తమ వార్డులలో సమస్యల ప్రస్తావనలు, విజ్ఞప్తులు

**3.** సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యల్ని క్రోడీకరించి స్థానిక మున్సిపల్ అధికారులతో ఆ సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలి.

ముఖ్యమైన సమస్యలు వెలుగులోకి తేవడానికి మున్సిపల్ ఛైర్మన్, అధ్యక్ష బృందం, ప్రజా కౌన్సిలర్లు ఆయా ప్రాంతంలో క్షేత్రసందర్శనలు చెయ్యాలి.

**4.** ఈ ప్రజా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల నిర్వహణకు, ఎజెండా రూపొందించడానికి, చర్చకు వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించడానికి, మెమోరాండాలు రూపొందించడానికి, క్షేత్ర సందర్శన ఏర్పాట్లు చెయ్యడానికి సురాజ్య కమిటీ ఒక వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చెయ్యాలి. కొంత అనుభవం గల వారిని దీనికి కన్వీనరుగా పెట్టి ఈ కార్యక్రమం సజావుగా జరగడానికి ఏర్పాట్లు చెయ్యాలి.

**అక్టోబరు 15-20 వరకు మన ఊళ్లో సురాజ్యంపై కరపత్రాలు, పోస్టర్లతో ప్రచారం, పట్టణ కూడళ్ళలో సురాజ్యం ఫ్లెక్సీలు**

**అక్టోబరు 25 వరకు తొలిదశ వలంటీర్ల నమోదు**

**వలంటీర్ల ఆసక్తినిబట్టి 5 బృందాలుగా ఏర్పాటు బృందాలవారీగా వేర్వేరు శిక్షణ - గైడ్ చెయ్యగల వారితో నిర్దిష్టంగా బృందాల ఏర్పాటు**

## II జన లోకాయుక్త ఏర్పాటు (మన ఊళ్లో అవినీతి)

1. సురాజ్య ఉద్యమకమిటీ సమావేశమైన పట్టణానికి ఒక జనలోకాయుక్తను ఏర్పాటు చెయ్యాలి. ఇందులో 10, 11 మందిని సభ్యులుగా చేసుకోవచ్చును.
రిటైర్డ్ జడ్జీలు, సీనియర్ న్యాయవాదులు, రిటైర్డ్ పోలీసు ఉద్యోగులను భాగస్వాములను చెయ్యాలి.
వీరిలో ఒకరిని జన లోకాయుక్త అధ్యక్షులుగా మిగిలిన వారిని న్యాయబృందంగా ప్రకటించాలి.

2. జన లోకాయుక్త ప్రతి 15 రోజులకు సమావేశం అవుతుంది. (ఒక వారంలో ప్రజా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగితే మరో వారంలో జన లోకాయుక్త సమావేశం జరిగేలా తేదీలు నిర్ణయించుకోవాలి.)
ప్రభుత్వ సేవలు, పథకాలు, ఇతరత్రా అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను స్వీకరిస్తుంది. ఈ సమావేశంలో వాటిపై ఫిర్యాదులను వింటుంది. అవసరమయితే బహిరంగ విచారణ నిర్వహిస్తుంది. ప్రాథమిక సాక్ష్యాధారాలున్న కేసులను నిర్ధారించి సంబంధిత నేర పరిశోధన విభాగాలకు, అధికారులకు తగిన చర్యలు నిమిత్తం పంపిస్తుంది. బాధితులకు సత్వరన్యాయం జరిగేలా సంప్రదింపులు జరుపుతుంది.

3. జన లోకాయుక్త బృందానికి తోడ్పాటునివ్వడానికి సురాజ్య కమిటీ ఒక వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేసి ప్రజా ఫిర్యాదుల సేకరణకు, విచారణకు, తదుపరి చర్యలకు జన లోకాయుక్తకు తోడ్పాటునిస్తుంది.

## III ముఖ్యమైన ఇతర బృందాలు

**1. మన ఊళ్లో పౌర వసతులు :** సురాజ్య ఉద్యమ కమిటీ సమావేశమై దీనికి ఒక కన్వీనర్‌నీ వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చెయ్యాలి. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, లైట్లు పరిస్థితిపై ఆయా వార్డు ప్రజా కౌన్సిలర్ల తోడ్పాటుతో సర్వేలు నిర్వహించి నివేదికలు రూపొందించాలి. తక్షణం స్పందించాల్సిన సమస్యలను సురాజ్య ఉద్యమ కమిటీ దృష్టికి తేవాలి. ప్రతి వార్డు స్థాయిలో 1000 రూపాయల తలసరి గ్రాంటు ఆధారంగా ఒక సూక్ష్మ ప్రణాళికను స్థానికుల భాగస్వామ్యంతో రూపొందించాలి. ప్రజా ఫిర్యాదుల బాక్స్‌లను ప్రధానమైన చోట్ల ఏర్పాటు చేసి ప్రతి రోజు వాటిని సేకరించి తగు చర్యలు నిమిత్తం మున్సిపాలిటీకి నివేదించే ఏర్పాటు చేసుకోవాలి.

**2. మన ఊళ్లో పౌరసేవలు :** సురాజ్య కమిటీ ఏర్పాటు చేసే ఈ బృందం సిటిజన్స్ ఛార్టర్ల అమలు కోసం కృషి చెయ్యాలి. వీలైన పట్టణాలలో పౌరసేవాకేంద్రాన్ని ఏర్పాటు చెయ్యాలి. అలాగే మున్సిపాలిటీకి సంబంధించి సమాచార హక్కు చట్టం ప్రకారం విధిగా వెల్లడించాల్సిన అంశాలు అందరికీ అందుబాటులోకి తేవాలి.

సకాలంలో ఫిర్యాదులు పరిష్కారం, సమాచారం అందించినప్పుడు మున్సిపల్ కమిషనర్‌నీ, బాధ్యులైన సిబ్బందినీ పూల గుచ్ఛాలతో సత్కరించండి. సకాలంలో సేవలు అందించకపోతే అందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించండి. ఈ కార్యకలాపాలు సురాజ్య కమిటీ ఆమోదంతో నిర్వహించాలి.

**3. మన ఊళ్లో మానవాభివృద్ధి :** దీని కోసం సురాజ్య కమిటీ ఒక కన్వీనర్‌నీ వలంటీర్ల బృందాన్ని రూపొందించాలి. ఈ బృందం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలలో సిబ్బంది, వసతుల కొరతలపై సర్వేలు నిర్వహించి నివేదికలు రూపొందిస్తుంది. సురాజ్య కమిటీ ఈ సమస్య పరిష్కారానికి తగిన మెమోరాండాలు, సంబంధిత అధికారులతో చర్చలు సాగించాలి.
అలాగే ఈ బృందం ప్రభుత్వ వైద్య, ఆరోగ్య సేవలు, అంగన్‌వాడీల మీద సర్వేలు నిర్వహించి నివేదికలు రూపొందించాలి. తక్షణ సమస్యలపై సురాజ్య కమిటీ స్పందించాలి.
యువతకు ఉపాధి పథకాల అమలు శిక్షణా కార్యక్రమాల ఏర్పాట్ల పై సర్వే నిర్వహించాలి. యువతతో ప్రత్యేక రౌండ్‌టేబుల్స్ నిర్వహించి ఈ అంశాలను చర్చించాలి. పథకాలలో అవినీతి వుంటే దానిని "జన లోకాయుక్తకు" నివేదించాలి.

ఇవన్నీ సురాజ్యం పేరుతో నిరంతరాయంగా సాగించాల్సిన కార్యక్రమాలు. దీనికి వలంటీర్లు, శిక్షణ అవసరం అందుకు విస్తృత ప్రచారం చెయ్యాలి. ప్రతి కాలేజీలో, ప్రతి పౌరసేవా సంస్థలో వలంటీర్ల నమోదుకు ఏర్పాట్లు చెయ్యాలి. వలంటీర్లను పైన పేర్కొన్న విధంగా ఐదు బృందాలు చేసి వారికి నిర్దిష్టంగా కార్యక్రమాలను అప్పగించాలి.

## IV సురాజ్య నిధి - ఇతర వసతులు

స్థానికంగా ప్రచారానికి, సభలు సమావేశాల నిర్వహణకీ అవసరమైన నిధులను సురాజ్య కమిటీ సేకరించాలి. సురాజ్య కమిటీ, ప్రజా మున్సిపల్ కౌన్సిల్, జన లోకాయుక్తలలోని సభ్యుల నుంచి ఎంతో కొంత మొత్తం అడిగి తీసుకోవాలి. సురాజ్యఉద్యమానికి తోడ్పాటునిచ్చే దాతల నుండి ప్రతి పట్టణంలో నిధులు సేకరించుకోవాలి. వీటి జమాఖర్చుల నిర్వహణకు కోశాధికారిని ఏర్పాటు చేసుకోవాలి. జమాఖర్చులు ప్రతి సురాజ్య కమిటీ సమావేశంలో ప్రకటించాలి.

## V సురాజ్య ఉద్యమంలో యువతని, మహిళలనీ, భాగస్వాములను చెయ్యడానికి ప్రత్యేక చర్చలు

**1. విద్యార్థులు, యువతతో రౌండ్‌టేబుల్** : వివిధ కాలేజీల నుండి విద్యార్థులను, వివిధ యువజన సంస్థల ప్రతినిధులను ఆహ్వానించి ఒక రౌండ్‌టేబుల్‌ను ప్రత్యేకంగా నిర్వహించి వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి. అన్ని కాలేజీలలోనూ విద్యార్థులతో చర్చాగోష్ఠులు, ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించాలి.

**2. మహిళా రౌండ్‌టేబుల్** : మహిళా టీచర్లు, లాయర్లు, డాక్టర్లు – మహిళాసంస్థలు– పొదుపు సంఘాల నాయకులను ఆహ్వానించి మహిళలకు ఒక ప్రత్యేక రౌండ్‌టేబుల్‌ను నిర్వహించి – ఇందులో వలంటీర్ల నమోదు – వివిధ కార్యకలాపాల బృందాలలో ఆసక్తిగల వారికి బాధ్యతలు అప్పగించాలి – ప్రజా వార్డు కౌన్సిలర్లుగా ఆసక్తి వున్నవారిని గుర్తించి వారికి అవకాశం కల్పించాలి.

**పట్టణ సురాజ్య కమిటీలు ప్రతివారం సమావేశమై ఈ కార్యకలాపాలను సమన్వయం చెయ్యాలి.**

## VI అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం: సురాజ్యం మార్చ్

డిశంబర్ 9 అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం ప్రతి పట్టణంలోనూ నిర్వహించాలి. ( మీ పట్టణంలో స్థానిక విద్యాసంస్థల వీలునుబట్టి ఒకరోజు అటు ఇటూగా) అన్ని విద్యాసంస్థలతో ముందుగానే సంప్రదించుకుని వేలాదిమందితో సురాజ్య మార్చ్ నిర్వహించాలి. ఇప్పటినుంచి సురాజ్య మార్చ్‌కు సన్నాహాలు చేయవలసిందిగా కోరుతున్నాం. ◆







## విద్యాసంస్థలకు, విద్యార్థులకు విజ్ఞప్తి

డిశంబర్ 9 అంతర్జాతీయ అవినీతి దినం సందర్భంగా '**సురాజ్యం మార్చ్**' నిర్వహించుకుందాం. డిశంబర్ 9, 8 తేదీలు ఆదివారం, రెండవ శనివారం అయినందున సురాజ్యం మార్చ్‌ని డిశంబరు 5,6,7 తేదీలలో పట్టణంలో విద్యాసంస్థల వీలునుబట్టి స్థానిక పట్టణ సురాజ్య కమిటీలు నిర్ణయించిన ఏదో ఒకరోజు నిర్వహించుకోవాలి. విద్యార్థినీవిద్యార్థులు, అన్ని విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు తమ తమ బ్యానర్లతో సురాజ్యం మార్చ్‌లో పాల్గొనాల్సిందిగా కోరుతున్నాం.

**సుపరిపాలన మన పౌర హక్కు - సురాజ్యం మన జన్మహక్కు**

**సురాజ్యం మార్చ్.... అందరికీ స్వాగతం**

**రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి నిర్వహిద్దాం**

# గాంధేయవాది మూర్తిరాజు ఇక లేరు

గాంధేయవాదానికి నిలువెత్తు ప్రతిరూపం, విద్యాదానానికి సిసలైన అర్థం... నిజాయితీకి నిలువుటద్దం. ఎంతో మందికి స్ఫూర్తి ప్రదాత అయిన మూర్తిరాజు ఇక లేరు. తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న స్వాతంత్ర సమరయోధుడు చింతల పాటి వరప్రసాద మూర్తిరాజు (93) తేది:12-11-2011, సోమవారం రాత్రి కన్నుమూశారు. పశ్చిమ గోదావరి జిల్లా పెదనింద్రకొలనులోని తన స్వగృహంలో ఆయన తుదిశ్వాస విడిచారు. గాంధేయ వాదం అంటే ఏంటో ఈ తరం వారు కూడా ప్రత్యక్షంగా చూడగలిగారంటే... అది మూర్తిరాజు పుణ్యమే. 1800 ఎకరాల ఆస్తి మొత్తాన్ని జిల్లాలో విద్యాభివృద్ధి కోసం దానం చేసిన ఘనత ఆయనకు మాత్రమే దక్కుతుంది. గత ఆరునెలలుగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న ఆయన... ఇటీవలే భీమవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యి... అప్పటినుంచి తన సొంతింట్లోనే చికిత్స పొందుతున్నారు.



సామాజిక, విద్యా, రాజకీయ రంగాల్లో మూర్తిరాజు సుదీర్ఘకాలం పాటు ఈ ప్రాంతంలో ధ్రువనక్షత్రంగా వెలిగారు. రాష్ట్ర రాజకీయాల్లో ఒకప్పుడు కీలకంగా వ్యవహరించారు. పీవీ నరసింహారావు మంత్రివర్గంలో 15 నెలల పాటు దేవాదాయమంత్రిగా వ్యవహరించారు. సమితి ప్రెసిడెంట్‌గా ఆరుసార్లు ఎన్నికయ్యారు. 1919లో జన్మించిన మూర్తిరాజు... టీడీపీ ఆవిర్భావం ముందు వరకు పశ్చిమగోదావరి జిల్లా రాజకీయాల్లో ప్రధాన భూమిక పోషించారు. భూదానోద్యమంలో ఆయన 'సర్వోదయ' మాసపత్రిక సంపాదక బాధ్యతలను కొన్నాళ్లు భుజానికెత్తుకున్నారు. వినోబాభావే పాదయాత్రలో చురుగ్గా వ్యవహరించారు. వినోబాభావే ఉపన్యాసాలను ఏ రోజుకారోజు అనువదించడం, అచ్చు వేయించడం ద్వారా ఈ ఉద్యమాన్ని జిల్లా అంతటా విస్తరించడంలో మూర్తిరాజు చేసిన కృషి అనిర్వచనీయం. 1930లో ఆయన 28 హైస్కూళ్లు, ఐదు జూనియర్ కళాశాలలు, ఆరు డిగ్రీ కళాశాలలు, 23 సంస్కృత పాఠ శాలలు, మూడు సంస్కృత కళా శాలలు, ఒక వ్యాయామ కళాశాలను స్థాపించి చాలాకాలం నిర్వహించి ప్రభుత్వానికి అప్పగించారు. ఆయన మూర్తిరాజుకు కొల్లేరుతో కూడా ప్రత్యేక సాన్నిహిత్యం ఉండేది. ఆయన ఈ సరస్సుపై రచనలు కూడా చేశారు. మూర్తి రాజుకు కళాభిమానం కూడా ఎక్కువే. తన స్వగ్రామం లో లక్షలాది రూపా యలను సొంతంగా భరించి మహాత్మాగాంధీ భవనం పేరిట ఒక అద్భుతమైన భవనం నిర్మించారు. గాంధీ మహాత్ముడి జీవిత చరిత్రను భావితరాలు తెలుసుకునేలా ఈ భవనంలో 596 చిత్రాలను అందుబాటులో ఉంచారు. రాజకీయాలు వేరు, ప్రజలకు సేవచేయడం వేరని భావించకుండా ఈ రెండింటికి సమాన సేవలందించారు.

### లోక్‌సత్తా నివాళి

రాజకీయాలలో విలువల కోసం నిలబడిన తరానికి ప్రతినిధి అయిన మూర్తి రాజుగారికి లోక్‌సత్తా పార్టీ నివాళులర్పించింది. ఒక గొప్ప దేశ భక్తుణ్ణి, గాంధేయవాదిని, విద్యాదాతను రాష్ట్రం కోల్పోయిందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్, కార్యనిర్వాహక అధ్యక్షులు డి.వి.వి.యస్. వర్మ తమ సంతాప ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబసభ్యులకు, బంధు మిత్రులకు, అభిమానులకు తమ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు. ●

# ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణాలకు కళ

- డా॥ జయప్రకాష్ నారాయణ్

కొన్ని వారాల కిందట ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు నేను గుంటూరు వెళ్లాను. అక్కడ కొరిటపాడు అనే ప్రాంతంలో మహిళలు ప్రభుత్వంతో కలసి పౌర వసతుల కల్పనకు కృషిచేయటం నాకెంతో ఆనందాన్ని కలిగించింది. వారు మున్సిపల్ కార్పొరేషన్‌తో చేయీ చేయీ కలిపి రోడ్లు, ఇతర పౌర సదుపాయాల కల్పనలో పాలుపంచుకుంటున్నారు. వీరు తమ కాలనీలో 4.5 లక్షల రూపాయల వ్యయంతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందులో 1.8 లక్షల (40శాతం) రూపాయలను ప్రజలు సమకూర్చగా, మిగిలిన 2.7 లక్షలను మున్సిపాలిటీ భరించింది. ఫలితంగా, చక్కటి కాంక్రీట్ రోడ్డు రూపుదాల్చింది. అది కూడా 3.5 లక్షల వ్యయంతోనే. అంటే లక్ష రూపాయలు ఆదా అయిందన్నమాట. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండానే ప్రాజెక్టు వ్యయంలో 22 శాతాన్ని వారు ఆదా చేయగలిగారు. ఇదంతా ఎలా సాధ్యమైంది? ఈ ప్రశ్నకు సమాధానం చాలా సులభం. తమకు ప్రయోజనం చేకూర్చే పథకంలో ప్రజలు పూర్తిగా మమేకమయ్యారన్నమాట. పథకం రూపకల్పన, ఆచరణ, పెట్టుబడి.. వంటి అన్ని దశల్లోనూ వారు స్వయంగా పాలుపంచుకున్నారు. అందువల్లనే 40 శాతం నిధుల్ని సమకూర్చగలిగారు. ఆ మేరకు మున్సిపాలిటీపై ఆర్థికభారం తగ్గించగలిగారు. అంచనా వ్యయంలో 20 శాతం ఆదా చేయగలిగారు. అలా మిగిల్చిన డబ్బులో 90,000 రూపాయలను తమకు అవసరమైన పైప్‌లైన్ నిర్మాణానికి వెచ్చించారు.



**జేపీ భవిష్యత్ భారతం**

జనవరి 17, 2005న ప్రచురితమైన వ్యాసం

## విశ్వాసం నెలకొనాలి

ప్రభుత్వ నిర్వహణలో ప్రజలు భాగస్వాములని, వారే సార్వభౌములని గుర్తింపు లభించిన ప్రతిచోట అద్భుతమైన రీతిలో ఫలితాలు ఒనగూడాయి. గుంటూరు మహిళల ఉదంతమే ఇందుకు నిదర్శనం. ఇలాంటిదే ఓ సంఘటన ప్రకాశం జిల్లాలోనూ జరిగింది. అక్కడి రైతులు లక్ష కుటుంబాలకు లబ్ధి చేకూరే విధంగా లక్షా యాభైవేల ఎకరాలకు సాగునీరందించే పనుల్ని చేపట్టి విజయం సాధించారు. బోర్‌వెల్స్, డైవర్షన్ స్కీములు, ఎత్తిపోతల పథకాలకు అవసరమైన నిధులలో ఎక్కువ భాగాన్ని ప్రజలనుంచి సేకరించడం ద్వారా, భూముల్ని తనఖా పెట్టడం ద్వారా సమకూర్చుకున్నారు. ఇలా అనుకున్న సమయంలో, తక్కువ వ్యయంతో నాణ్యమైన పనుల్ని చేపట్టారు. ఈ రకమైన విజయగాథలే కాదు, కొన్ని పరాజయ ఉదంతాలూ ఉన్నాయి. రైతులంతా కలిసి సహకార సంఘంగా ఏర్పడి, సంఘం పేరుమీదుగా రుణాలు తెచ్చి నిర్మించిన ఎత్తిపోతల పథకాలు చాలా వరకూ విఫలమయ్యాయి. రైతులు తమ సొంత భూముల్ని తనఖా పెట్టలేదు. కాబట్టి, రుణాలకు వ్యక్తిగతంగా వారు బాధ్యులు కాకపోవడంతో, అప్పులు తీర్చే బాధను సంఘానికే వదిలిపెట్టి, తాము చేతులు దులుపుకున్నారు. రైతులు తమ వాటా డబ్బుతో రుణం చెల్లించిన సందర్భాలు చాలా అరుదు. కనీసం ఎత్తిపోతల పథకాల నిర్వహణ ఖర్చులు చెల్లించేందుకు కూడా వారు సుముఖత చూపేవారు కాదు.

దీంతో, అనేక పథకాలు ఆచరణలో విఫలమయ్యాయి. పన్నుల రూపేణా లేదా ఇతరత్రా తాము చెల్లించే డబ్బుకూ – తమకు లభిస్తున్న సేవలకు మధ్య గల సంబంధమేమిటో స్పష్టంగా తెలిస్తే డబ్బు చెల్లించేందుకు, పథకాలను స్వయంగా నిర్వహించేందుకు ప్రజలు వెనుకాడరన్న విషయం దీనినిబట్టి స్పష్టమవుతోంది. లేనిపక్షంలో పన్నులు, సర్వీసు ఛార్జీలు చెల్లించేందుకు వారు ముఖం చాటేస్తారు. ఫలితంగా ప్రజోపయోగకరమైన పనులు కూడా కుంటుపడతాయి. హైదరాబాద్‌లోనూ, చుట్టపక్కలా ఉన్న పారిశ్రామిక ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజ్ తదితర పౌరవసతుల కల్పన ఒకప్పుడు అధ్వానంగా ఉండేది. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏ.పి.ఐ.ఐ.సి) ఇక్కడ పారిశ్రామికవాడలనూ, టౌన్‌షిప్పులనూ నిర్మించి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్థలాలు కేటాయించి ఇచ్చింది. వీరినుంచి ఏ.పి.ఐ.ఐ.సి. ఏటా కొంతమొత్తాన్ని వసూలు చేసేది. అందులో కొంతభాగాన్ని మున్సిపాలిటీకి చెల్లించి, పౌరవసతుల నిర్వహణను తానే చేపట్టేది. ఈ రకమైన ఏర్పాటు ఇరువర్గాలకు అసౌకర్యంగా ఉండేది. పరిశ్రమలు నిర్వహణ ఖర్చులు చెల్లించడం లేదని ఏ.పి.ఐ.ఐ.సి ఆరోపించేది. పౌరవసతుల నిర్వహణ మెరుగ్గా లేదని పారిశ్రామికవేత్తలు ఫిర్యాదు చేసేవారు. ఈ దశలో నేను జోక్యం చేసుకుని నిర్వహణ ఖర్చుల్ని వసూలు చేయడం, పౌరవసతులను కల్పించడం – ఈ రెండు బాధ్యతలనూ పరిశ్రమలకే అప్పగించేలా చేశాను. ఇది జరిగిన కొన్ని రోజులకే, రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ తదితర వసతులు మెరుగుపడ్డాయి. పౌరవసతుల నిర్వహణ సరిగ్గా లేకపోతే, నష్టపోయేవి స్థానిక పరిశ్రమలే. అందువల్ల ఈ విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు ఎంతో జాగరూకతతో వ్యవహరించేవి. పౌరవసతులు ఎవరికైతే అవసరమో, వాటి నిర్వహణ బాధ్యతను వారికే అప్పగించటం వల్ల కలిగిన ప్రయోజనమిది. వనరులకూ, సేవలకు మధ్యగల సంబంధాన్ని ప్రత్యక్షంగా, అనుభవపూర్వకంగా ప్రజలు తెలుసుకోవడంతో పారిశ్రామికవాడల్లోని పరిస్థితి క్రమేపీ మెరుగుకావడం మొదలైంది.

దేశ జనాభాలో అధికభాగం పల్లెల్లోనే ఉందనేది మనలో చాలా మంది నిశ్చితాభిప్రాయం. నిజానికి 30 శాతం జనాభా ఇప్పుడు పట్టణాలు, నగరాల్లోనే ఉంది. తమిళనాడు వంటి రాష్ట్రాలలో పట్టణ జనాభా 45 శాతానికి చేరుకుంది. విద్య, వైద్యం, ఉపాధి వంటి సౌకర్యాల కోసం పట్టణాలు, నగరాలకు ప్రజలు వలసపోవడమనేది ఆర్థికాభివృద్ధిలో అనివార్యమైన ప్రక్రియ. ఇలా జనాభాపరంగా పెరిగిపోతున్న పట్టణాలు, నగరాల నిర్వహణ దేశం ఎదుర్కొంటున్న పెనుసవాళ్లలో ఒకటి. జంషెడ్‌పూర్ నగరాన్నే తీసుకుంటే, టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీని కేంద్రంగా చేసుకుని ఆ నగరం ఆవిర్భవించింది.

**ఇటీవల నగరంలో అభివృద్ధి జాడలు కాస్తో కూస్తో కనబడుతున్నా, రోడ్లు, నీటి సరఫరా, చెత్త తొలగింపు వంటి పౌరవసతుల విషయంలో పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. తలసరి వార్షిక వ్యయంలో జంషెడ్‌పూర్ కంటే హైదరాబాద్ ముందున్నా, వసతుల కల్పనలో వెనకబడే ఉంది.**

దేశంలోనే ఎంతో వెనుకబడిన జార్ఖండ్ రాష్ట్రంలో జంషెడ్‌పూర్ ఉన్నప్పటికీ, అభివృద్ధిలో దేశంలోని అన్ని నగరాలకంటే ముందుంది. పది లక్షల జనాభా ఉన్న ఈ నగరంలో పౌరవసతుల కల్పన, నిర్వహణ బాధ్యతలను టాటాస్టీల్ కంపెనీయే నిర్వహిస్తోంది. జంషెడ్‌పూర్‌లో అత్యున్నత ప్రమాణాలతో కొనసాగుతున్న పౌరవసతులు దేశంలోని మరే నగరంలోనూ లేవంటే అతిశయోక్తి కాదు. సురక్షితమైన తాగునీటికి ఈ నగరం పెట్టింది పేరు. రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉంటాయి. చెత్తాచెదారమనేది మచ్చుకైనా కనపడదు. మురుగునీటి పారుదల వ్యవస్థ గురించి చెప్పనే అక్కర్లేదు. టాటాస్టీల్‌కు చెందిన పారిశుద్ధ్యం వాహనాలు ఏటా 1,20,000 టన్నుల చెత్తను తొలగిస్తూ ఉంటాయి. కరెంటుకు సంబంధించిన పనులను టౌన్ ఎలక్ట్రిక్ డిపార్ట్‌మెంట్ చూసుకుంటుంది. ఓ కాలేజీ, పలు పాఠశాలల నిర్వహణ స్థానికంగానే జరుగుతోంది. ఈ వసతుల కల్పనకు అయ్యే మొత్తం వ్యయం ఏడాదికి 139 కోట్ల రూపాయలు మాత్రమే. అంటే... తలసరి వాటా 1400 రూపాయలు. ఇలా కేవలం 64 చదరపు కిలోమీటర్లు పరిధిలో విస్తరించి ఉన్న ఈ చిన్న నగరం పట్టణ ప్రాంతాల సమర్థవంతమైన నిర్వహణకు ఓ ప్రతీకగా నిలిచింది.

హైదరాబాద్ నగర జనాభా 2001 జనగణన ప్రకారం 37 లక్షలు కాగా మున్సిపల్ కార్పొరేషన్ వార్షిక బడ్జెట్ 600 కోట్ల

రూపాయలు. అంటే తలసరి వార్షిక వ్యయం 1600 రూపాయలన్నమాట. ఇటీవల నగరంలో అభివృద్ధి జాడలు కాస్తో కూస్తో కనబడుతున్నా, రోడ్లు, నీటి సరఫరా, చెత్త తొలగింపు వంటి పౌరవసతుల విషయంలో పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. తలసరి వార్షిక వ్యయంలో జంషెడ్‌పూర్ కంటే హైదరాబాద్ ముందున్నా, వసతుల కల్పనలో వెనకబడే ఉంది. యాభైలక్షల జనాభా గల చెన్నై నగరం 2004-05లో రాబడి, మూలధన వ్యయాలతో కలుపుకుని పౌరవసతుల నిర్వహణకు ఖర్చుచేసిన మొత్తం 858 కోట్లు. అంటే, తలసరి వార్షిక వ్యయం 1600 రూపాయలు. అలాగే కోటీ ఇరవై లక్షల జనాభా గల ముంబాయి మహానగరం... విద్యుత్ సరఫరా, రవాణాకు అయ్యే వ్యయంతో కలుపుకుని ఏటా 4000 కోట్ల రూపాయలు వ్యయం చేస్తోంది. అదనపు వ్యయాన్ని వేరుచేసి చూసినా తలసరి వార్షిక వ్యయం రెండువేల రూపాయలు. అలాగే 45 లక్షల జనాభా కలిగిన బెంగుళూరు నగరం 2000 రూపాయల తలసరి చొప్పున 937 కోట్లు వ్యయం చేస్తోంది. దేశంలోని ఏ ప్రధాన నగరమైనా జంషెడ్‌పూర్‌ను మించి తలసరి వ్యయం చేస్తోంది. అయినప్పటికీ ప్రజలకు నాణ్యమైన సేవలు అందడం లేదు. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న నగరాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి, పౌర వసతులు సమకూర్చడానికి మరిన్ని నిధులు అవసరం. పన్నుల రూపేణా వసూలు చేసిన మొత్తాన్ని సరైన రీతిలో ఖర్చుచేసి, తగిన ప్రతిఫలం రాబట్టినప్పుడు మరింత ఎక్కువ మొత్తాలను చెల్లించేందుకు ప్రజలు వెనుకాడరు. సేవల నాణ్యతకు, పన్నుల చెల్లింపు పట్ల ప్రజల సుముఖతకు మధ్య అవినాభావ సంబంధం ఉందన్న విషయం ఇక్కడ గమనార్హం.

## వార్డు కమిటీలతో మేలు

ప్రజలు చెల్లించే పన్నులకూ, వారికి అందే సేవలకూ అద్దంపట్టే ఓ సున్నితమైన యంత్రాంగం ఏర్పాటుకు రాజ్యాంగమే వెసులుబాటు కల్పించింది. రాజ్యాంగంలోని 243-ఎస్ అధికరణ వార్డు కమిటీల ఏర్పాటును నిర్దేశిస్తోంది. దీని ప్రకారం సుమారు మూడు లక్షల జనాభా కలిగిన మున్సిపాలిటీలో ఒకటి లేదా అంతకుమించి వార్డు కమిటీలను ఏర్పాటు చేసుకోవచ్చు. కమిటీల ఏర్పాటు, సభ్యుల నియామకం, వాటి అధికారాలు, విధులను ఆయా రాష్ట్రాల శాసనసభలు నిర్ణయిస్తాయి. వసతుల కల్పన, నిర్వహణలో ప్రజల్ని భాగస్వాములను చేసేందుకు ఈ వార్డు కమిటీలు ఎంతగానో దోహదపడతాయి. ఉదాహరణకు ప్రతి మున్సిపల్ వార్డుకూ ఓ కమిటీ చొప్పున ఉందనుకుంటే, స్థానికంగా వసూలు చేసిన ఆస్తిపన్నులో కొంత వాటాను వార్డు కమిటీకి కేటాయిస్తారు. స్థానికంగా రోడ్లు, డ్రైనేజీ, నీటిసరఫరా, వీధిదీపాల ఏర్పాటు వంటి వసతుల కల్పన, నిర్వహణ బాధ్యతలను వార్డు కమిటీ చేపడుతుంది. ఈ బాధ్యతలను నిర్వర్తించే సిబ్బంది ప్రధానాధికారి వార్డు కమిటీ నియంత్రణలో ఉంటారు. సిబ్బంది జీతభత్యాల చెల్లింపులు కూడా స్థానికంగానే జరుగుతాయి. ప్రజలు ఎన్నుకున్న వార్డు కౌన్సిలర్ వార్డు కమిటీకి అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. ఈ రకమైన యంత్రాంగం ద్వారా వసతుల కల్పన, నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది. అప్పుడు నాణ్యమైన పౌర సదుపాయాల కల్పన కోసం అదనంగా డబ్బు చెల్లించాలన్నా వారు వెనుకాడరు.

ప్రభుత్వం వార్డు కమిటీలను ఏర్పాటు చేస్తున్నా, అది మొక్కుబడి వ్యవహారంగా సాగుతోందే తప్ప దాని అసలు ఉద్దేశం నెరవేరడం లేదు. హైదరాబాద్ నగరంలో సగటున నాలుగు లక్షల జనాభాకు ఒకటి చొప్పున వార్డు కమిటీలు ఉన్నాయి. కానీ, ఈ కమిటీల్లో ప్రజల భాగస్వామ్యం ఎక్కడా కనబడదు. ఫలితంగా, రోడ్లు డ్రైనేజీలు, చెత్త తొలగింపు వంటి కనీస పౌర సదుపాయాల కోసం ప్రజలు కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరగవలసి వస్తోంది. ప్రజల నుంచి ఈ రకమైన ఫిర్యాదులు పెరిగిపోవడంతో మున్సిపల్ కమిషనర్లు ఏంచేయాలో తెలియక చేతులెత్తేస్తున్నారు. వసతులు సమకూరకపోవడంతో ప్రజలు పన్నులు చెల్లించకపోవడం, దానివల్ల వనరులు తరిగిపోవడం సహజంగా జరుగుతోంది. చివరకు ఇది ఒక సమస్యల సుడిగుండంలా తయారై, పట్టణాలు, నగరాల అభివృద్ధిని హరించివేస్తోంది. ఈ విషవలయాన్ని మనం ఛేదించగలగాలి. కొరిటపాడు మహిళలు, ప్రకాశం రైతుల ఐకమత్యం, జంషెడ్‌పూర్ ప్రగతి, పారిశ్రామిక మున్సిపల్ ప్రాంతాల అభివృద్ధి వంటి ఉదంతాలు మనకు ఆదర్శం కావాలి. ప్రజల భాగస్వామ్యంతో మెరుగైన మౌలిక వసతులు, పౌర సదుపాయాలు ఉట్టిపడేలా మన పట్టణాలను, నగరాలను తీర్చిదిద్దుకోవాలి. ●

**(జేపీ భవిష్యత్ భారతం వ్యాస సంకలనం నుండి)**

# జన్యుమార్పిడి పంటల పరీక్షలపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన లోక్‌సత్తా

జన్యుమార్పిడి (జీఎం) పంటల క్షేత్రస్థాయి పరీక్షల మీద తాత్కాలిక నిషేధం విధించటానికి సుప్రీంకోర్టు నిరాకరించటాన్ని స్వతంత్ర రైతుసంఘాల సమాఖ్య అధ్యక్షుడు, లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ మనస్ఫూర్తిగా స్వాగతించారు. ఆ అంశంపై ఏర్పాటు చేసిన సాంకేతిక నిపుణుల కమిటీలో ఒక వ్యవసాయ నిపుణుడిని కూడా చేర్చి కమిటీని పునర్వ్యవస్థీకరించటం పట్ల జేపీ హర్షం వ్యక్తంచేశారు.

జీఎం పంటల పరీక్షల నిర్వహణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కొందరు దాఖలు చేసిన రిట్‌పిటిషన్‌లో లోక్‌సత్తా పార్టీ కూడా ఇంప్లీడ్ అయింది.

జనాభా నిరంతరంగా పెరుగుతున్న భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆహార, పౌష్టిక విలువల భద్రతకు జీఎం పంటలు తప్పనిసరి అని లోక్‌సత్తా పార్టీ తన పిటిషన్‌లో గట్టిగా వాదించింది.

సుప్రీంకోర్టు నియమించిన సాంకేతిక నిపుణుల కమిటీ అక్టోబర్ 7,2012న సమర్పించిన తన తాత్కాలిక నివేదికలో జీఎం పంటల క్షేత్రస్థాయి పరీక్షల మీద 10 ఏళ్ల నిషేధం విధించాలని సిఫార్సు చేసింది.

ఆ తాత్కాలిక నివేదిక జీఎం సాంకేతిక పరిజ్ఞానంలోని మేళ్లను పరిగణలోకి తీసుకోలేదని లోక్‌సత్తా పార్టీ తన పిటిషన్‌లో వాదించింది.

జన్యుమార్పిడి టెక్నాలజీలపై జరుగుతున్న మొత్తం చర్చలో రెండు వేర్వేరు అంశాలను కలగలపటం వల్ల గందరగోళం ఏర్పడిందని, టెక్నాలజీని, కొన్ని బహుళజాతి కంపెనీలు గుత్తాధిపత్యాన్ని చెలాయించే ప్రమాదాన్ని ఒకేగాటన కట్టి చర్చ చేయటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని లోక్‌సత్తా స్పష్టంచేసింది. టెక్నాలజీని ఆహ్వానించి దేశ అవసరాలకనుగుణంగా అన్వయించుకోవాల్సిన అవసరముందని, అదే సమయంలో రైతుల ప్రయోజనాలను కాపాడేలా, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేవారి గుత్తాధిపత్య ధోరణలకు అడ్డుకట్ట వేసేలా కొన్ని జాగ్రత్తలు కూడా తీసుకోవాల్సి ఉందని పేర్కొంది. మాతృకంపెనీల వాణిజ్య సంస్కృతి, గుత్తాధిపత్యాల ధోరణుల పట్ల అతి ఆందోళన వ్యక్తం చేసిన కమిటీ ఆ అంశాలు భారతదేశంలోని రైతులను దోపిడీ చేస్తాయని భావిస్తోంది.

కీలకమైన, నిరూపితమైన సాంకేతిక పరిజ్ఞానాలను గుత్తాధిపత్యం పట్ల మితిమీరిన భయాలతో దేశానికి అందకుండా తోసిపుచ్చటం ముఖం మీద కోపంతో ముక్కును తెగ్గోసుకోవటం లాంటిదని లోక్‌సత్తా పేర్కొంది.

బహుళ జాతి సంస్థ మోన్‌శాంటో తన బి.టి పత్తి విత్తనాల ధరను తగ్గించాలని 2006లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో తాను రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని జేపీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ పిటిషన్‌లోని అంశాల ప్రాతిపదికనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎం.ఆర్.టి.పి కమిషన్ ముందు మోన్‌శాంటోపై ఫిర్యాదు చేసిందని, ఫలితంగానే బి.టి పత్తి విత్తనాల ధరను తగ్గిస్తూ ఆదేశం జారీచేసిందని జయప్రకాష్ నారాయణ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ●



# ఉన్నత విద్య కోసం 'రూసా'

- ★ కేంద్రం కొత్త పథకం
- ★ విశ్వవిద్యాలయాలకు నిధుల పంట
- ★ కేంద్రం వాటా 65 శాతం, రాష్ట్రాలది 35 శాతం
- ★ మార్గ దర్శకాలు రూపొందించిన కేంద్రం

ప్రాథమిక, మధ్యమిక విద్య అభివృద్ధికి ప్రత్యేక పథకాలను అమలుచేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యపైనా దృష్టి పెట్టింది. రాష్ట్రీయ ఉచ్‌తర్ శిక్ష అభియాన్ (రూసా) పథకం ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్నత విద్య బలోపేతానికి అవసరమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా ఇంజినీరింగ్, వైద్య కళాశాలల ఏర్పాటుకు కూడా 'రూసా'లో అవకాశం కల్పించారు. ఇప్పటి వరకు కేంద్ర నిధులతో కేంద్ర విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలు మాత్రమే ప్రయోజనం పొందుతున్నాయి. రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు అరకొరగా మాత్రమే యూజీసి నుంచి నిధులు అందుతున్నాయి. ఇకపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఉన్నత విద్య కోసం విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల అభివృద్ధి జరిగేలా 'రూసా' ద్వారా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇటీవల ఢిల్లీలో ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శులతో కేంద్ర మానవవనరుల మంత్రిత్వశాఖ.. ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి రూసా కింద రూపొందించిన ముసాయిదా ప్రతిపాదన గురించి వివరించింది. ప్రాథమిక విద్య అభివృద్ధికి రాజీవ్ విద్య మిషన్ (ఆర్వీఎం), మాధ్యమిక విద్యాశాఖ అభివృద్ధికి రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) ద్వారా రాష్ట్రానికి రూ॥వేల కోట్లు వస్తున్నాయి. ఇదే క్రమంలో రూసా ద్వారా రాష్ట్రానికి నిధులు రానున్నాయి.

### 65:35 నిష్పత్తిలో....

రూసా ద్వారా నిధులు పొందాలంటే... రాష్ట్ర ప్రభుత్వాలు



వారి పరిధుల్లో తీసుకోవల్సిన ముందస్తు జాగ్రత్తలు, భవిష్యత్తు ప్రణాళికలపై కేంద్రం దిశా నిర్దేశం చేసింది. రూసా కింద కేంద్రం 65%, రాష్ట్ర ప్రభుత్వాలు 35% నిధులు భరించాలి. గుర్తించిన ప్రత్యేక రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిష్పత్తి వేరుగా ఉంది. 12వ పంచవర్ష ప్రణాళిక ద్వారా రూసా పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు వీలుగా త్వరలో సంబంధిత శాఖల మంత్రులతో కేంద్రం సమావేశమై కార్యాచరణను రూపొందించే దిశగా సమాయత్తమవుతోంది. వచ్చే ఏడాది నుంచే ఈ పథకం కార్యరూపం దాలుస్తుందని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.జి.గోపాల్ 'ఈనాడు' ప్రతినిధికి చెప్పారు. విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల అభివృద్ధికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తగిన సమయంలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారుచేసి, కేంద్రానికి సమర్పిస్తామని వెల్లడించారు.

రూసా కింద రాష్ట్ర ప్రభుత్వం నిధులు పొందాలంటే కేంద్రం నిర్దేశించిన విధంగా క్షేత్రస్థాయి వాస్తవిక పరిస్థితులను ప్రతిబింబించేలా శాస్త్రీయ కోణంలో 'రోడ్‌మ్యాప్'ను రూపొందించాలి. రాష్ట్రాలు తీసుకోవల్సిన జాగ్రత్తలు, భవిష్యత్తు ప్రణాళికలు ఎలా ఉండాలో, ఎలా ఉంటే నిధులను అందచేస్తామో ఢిల్లీలో జరిగిన ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శుల సమావేశంలో కేంద్రం క్షుణ్ణంగా వివరించింది. ఆ వివరించింది. ఆ వివరాలు...

- రాష్ట్ర విశ్వవిద్యాలయాలు సామర్థ్యానికి తగినట్లు రూ॥వంద కోట్లు వెంటనే విడుదల చేస్తారు. అక్రిడిటేషన్ విశ్వవిద్యాయానికి, కళాశాల మొత్తానికి కాకుండా విభాగాల వారీగా ఉండాలి.

- విశ్వవిద్యాలయాలు ఏదో ఒక ప్రత్యేక విద్యకు మాత్రమే పరిమితం కాకూడదు. సాధ్యమైనంత వరకు వివిధ రకాల విద్యాంశాలను అందించేలా అవి బలోపేతం కావాలి. విశ్వవిద్యాలయాల పరిధిలో అనుబంధ కళాశాలల గుర్తింపు పరిధిని బాగా తగ్గించాలి. ఒక్కో విశ్వవిద్యాలయపరిధిలో కేవలం 50 కళాశాలలు మాత్రమే ఉండాలి. అవసరమైతే 50 కళాశాలలు ఓ విశ్వవిద్యాలయంగా ఏర్పడవచ్చు. కళాశాల ఏర్పడి 25 సంవత్సరాలైతే.. నేషనల్ అక్రిడిటేషన్ కౌన్సెల్ 'ఏ' గ్రేడ్ ఇస్తుంది. దీనికి స్వయంప్రతిపత్తి హోదా ఇస్తారు. 50 సంవత్సరాలు ఉన్నట్లయితే.. సంబంధింత కళాశాలలకు డిగ్రీలను ప్రధానం చేసే అవకాశాన్ని కల్పిస్తారు.

- రాష్ట్ర విశ్వవిద్యాలయాల చట్టాలు కూడా పకడ్బందీగా ఉండాలి. ప్రస్తుతం ఉన్న చట్టాల్లోని లోపాలను గమనించి ప్రస్తు విద్య అభివృద్ధి అవసరాలకు తగినట్లు మార్పులు చేసుకోవాలి. అలాగే.. యూజీసీ నిపుణులతో ఓ కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీ కేంద్ర విశ్వవిద్యాలయాల చట్టాలకు అనుగుణంగా రాష్ట్ర చట్టాలు ఉండేలా సిఫార్సులు చేస్తుంది. ఇందుకు అవసరమైతే... రెండు నుంచి మూడేళ్ల వరకు సమయాన్ని తీసుకోవచ్చు. నిధుల పంపిణీలో ఈ అంశానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు.

- భారతదేశంలో 70% విశ్వవిద్యాలయాలు స్వయంపోషక కళాశాలలను నిర్వహిస్తున్నాయి. వీటిపై సరైన పర్యవేక్షణ కానీ, నియంత్రణ కానీ లేదని కేంద్రం గుర్తించింది. దీనివల్ల ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఆయా సామాజిక వర్గాల వారికి సరైన న్యాయం జరగడం లేదు. ఈ విధానంలో తప్పనిసరిగా మార్పులు తీసుకొచ్చి... పర్యవేక్షణ యంత్రాంగాన్ని రూపొందించాలి.

- ప్రతి జిల్లాలో ఓ ఆదర్శ డిగ్రీ కళాశాలను నెలకొల్పాలి. అవసరమైతే కొత్త డిగ్రీ కళాశాలలను కూడా దీనికి ఎంపికచేయవచ్చు.

- అలాగే అధ్యాపకులు సామర్థ్యాన్ని గుర్తించేందుకు, బాగా పనిచేసే వారిని ప్రోత్సహించేందుకు, విశ్వవిద్యాలయాల్లో శాఖల వారీగా ప్రత్యేక స్వయంప్రతిపత్తి హోదా కల్పించడం, పరిశోధనల పెంపునకు, ఇతరత్రా అంశాల మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి.

- అధ్యాపకుల సర్వీసు వ్యవహారాల పరిశీలనకు ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలి. విద్యార్థుల ప్రవేశాల రుసుముల ఖరారుకు ప్రత్యేక యంత్రాంగం ఉండాలి. ■

# నిర్దేశిత లక్ష్యాల దిశగా 'కాప్ -11'

**ప్రపంచ జీవ వైవిధ్య సదస్సు**
**హైదరాబాద్ - 2012**

జీవ వైవిధ్యానికి జరుగుతున్న నష్టాన్ని నిలిపివేయడానికి అంతర్జాతీయ సమాజం ప్రస్తుతం చేస్తున్న ఖర్చును 2015 నాటికి రెట్టింపు చెయ్యాలన్న అంగీకారంతో ప్రపంచ జీవ వైవిధ్య సదస్సు ముగిసింది. కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్) పేరుతో రెండేళ్లకోసారి జరుగుతున్న సదస్సుల క్రమంలో ఇది పదకొండవ సదస్సు. రియోడిజెనెరో లో 1992లో తొలి ధరిత్రీ సదస్సు జరిగింది. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ వంటికీలక అంశాలపై ఆ సదస్సులో లోతైన చర్చలు జరిగాయి. అనంతరం సాధించాల్సిన లక్ష్యాలను, దానికి అవసరమైన కాల వ్యవధిని నిర్దేశిస్తూ అంతర్జాతీయ సమాజం కొన్ని నిర్ణయాలను తీసుకున్నది. రియో నిర్ణయాల అమలును సమీక్షించడానికి 'కాప్' సదస్సులు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. లక్ష్యాల సాధనలో నిర్ణయాల అమలులో సాధించిన ప్రగతిని, ఎదురవుతున్న అవరోధాలను, అధిగమించడానికి మార్గాలను " కాప్" సదస్సులు చర్చిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితికి చెందిన అభివృద్ధి కార్యక్రమాలలో పర్యావరణ సంరక్షణ ప్రణాళికల తో ప్రపంచ దేశాలను భాగస్వాములను చేసేందుకు కాప్ సదస్సులు తోడ్పడుతున్నాయి. ఆచరణాత్మకమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడంలో వివిధ దేశాలకు కాప్ సదస్సులు వినియోగపడుతున్నాయి. 2012 అక్టోబర్ 1-19 తేదీలలో హైదరాబాద్‌లో కాప్-11 సదస్సు జరిగింది. దీనికి 184 దేశాలకు చెందిన 14 వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు. రెండు శిఖరాగ్ర సదస్సులతో పాటు పలు అధికారిక సదస్సులు సమాంతర సమావేశాలు, బృంద చర్చలు, గోష్టులు జరిగాయి. వాతావరణ మార్పులు జీవవైవిధ్యం, భూభాగంపై వున్న జలవనరులలోని పర్యావరణ



వ్యవస్థల సంరక్షణ, దీవులలోని జీవ వైవిధ్యం, రక్షిత తీర ప్రాంతాల సముద్రాలలోని జీవ వైవిధ్యం, ప్రధానాంశంగా లింగ సమానత్వం, అభివృద్ధి పేదరిక నిర్మూలనా కార్యక్రమాలలో భాగంగా జీవవైవిధ్యం, స్థానిక ప్రజల హక్కులను సంరక్షించడం వంటి అనేక అంశాలపై కాప్ 11 సదస్సు చర్చించింది. భూ మండలంలోని మొక్కలను జంతువులను, సహజసిద్ధమైన ఆవాసాలను సంరక్షించుకోవడానికి అవసరమైన సంపూర్ణ పథకాన్ని 2020లోగా అమలు చేయాలని అందుకోసం పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణ కోసం ఆయా దేశాలకు గల సామర్థ్యాలను పెంపొందించాలని హైదరాబాద్ సదస్సు భావించింది. గతంలో ఆమోదం పొందిన కార్టజెనా, నగోయా ఒప్పందాల అమలులో సంపన్నదేశాలకు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతాయి. సహజసిద్ధమైన స్థానిక విత్తనాలు, బీటీ విత్తనాలు, మేథోసంపత్తి హక్కులు, వంటి అంశాలపై కూడా విభేదాలు తలెత్తాయి. ప్రపంచీకరణ, సరళీకరణ, విధానాల ఆధారంగా నడుస్తున్న అభివృద్ధి నమూనాను ముందుకు తీసుకుపోయేందుకు సంపన్న దేశాలు 'కాప్-11" సదస్సులో గట్టి ప్రయత్నాలు చేసాయన్న విమర్శలు వినవచ్చాయి. పేద, వర్ధమాన దేశాలు ఈ వ్యూహాన్ని ఎదుర్కొనేందుకు యత్నించాయని కూడా తెలిసింది.

నిర్ణీత కాల వ్యవధిలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి ఆర్థిక వనరుల కేటాయింపు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన బదలాయింపు వంటి అంశాలపై సదస్సు ప్రధానంగా దృష్టి సారించింది. ఆతిథ్యమిచ్చిన భారతదేశపు చొరవతో చిట్టచివరన ఒకే ఏకాభిప్రాయం సాధ్యమైంది.

ప్రస్తుతం చేస్తున్న ఖర్చును 2015 నాటికి రెట్టింపు చేయడానికి అభివృద్ధి చెందిన దేశాలు అంగీకరించాయి. 2006-10 సంవత్సరాలలో చేసిన వార్షిక వ్యయాల సగటును దీనికి ప్రామాణికంగా ఆయాదేశాలు తీసుకుంటాయి. జీవవైవిధ్య సంరక్షణ కోసం దేశీయ వ్యయాలను గణనీయంగా పెంచుతాయి. జీవ వైవిధ్యానికి సంబంధించిన ప్రధానాంశాల కోసం చేసే వ్యయానికి అదనపు నిధులు కేటాయించడానికి భారత సహా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు, ఆఫ్రికా దేశాలు తొలిసారిగా ముందుకువచ్చాయి. నిధుల అవసరాన్ని అంచనావేసి వాటి సమీకరణ కోసం కృషి చేసేందుకు తొలిసారిగా ఒక ఆర్థిక వనరుల యంత్రాంగాన్ని హైదరాబాద్ సదస్సులో ఏర్పాటు చేశారు.

మొక్కలు,జంతువులకు సంబంధించి జీవ వైవిధ్య పరంగా సుసంపన్నమైన తీరప్రాంతాలను సంరక్షించడానికి, ఇంతవరకు వెలుగులోకి రాని ప్రాంతాలకు ప్రాముఖ్యం తేవడానికి సముద్రతీర ప్రాంతాలను వర్గీకరించాలని కూడా 193 దేశాలు ఈ సదస్సులోనే అంగీకరించాయి. 2020 నాటికి మరోఎనభై లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని సురక్షిత ప్రాంతంగా గుర్తించాలని సదస్సు నిర్ణయించింది. తీర ప్రాంతాల వర్గీకరణ తర్వాత, వాటి జీవ వైవిధ్య సంరక్షణ కోసం అవసరమైన అంతర్జాతీయ చట్టాల అమలు బాధ్యతను ఐరాస సర్వసభ్య సమావేశానికి అప్పగించాలని నిర్ణయించింది. ఇంతవరకూ ఆయా దేశాల పరిధిలో వున్న సముద్ర తీరాల జీవ వైవిధ్య సంరక్షణ బాధ్యత అంతర్జాతీయ సమాజం స్వీకరిస్తుంది.

జాతీయ జీవవైవిధ్య సంరక్షణ ప్రణాళికలలో ఆర్థిక సామాజిక, సాంస్కృతిక పర్యావరణ వ్యవస్థల స్థానికాంశాలను మిళితం చెయ్యాలని, అలాగే అభివృద్ధి సంస్థలు, పరిశ్రమలు తమ పథకాలలో, ప్రణాళికలలో జీవ వైవిధ్య లక్ష్యాలను సమ్మిళితం చెయ్యాలని హైదరాబాద్ సదస్సు పిలుపునిచ్చింది. నిస్సారపు భూములను తిరిగి సారవంతంగా మార్చడానికి ఒక నూతన కార్యక్రమాన్ని ఈ సదస్సు రూపొందించింది. 2020 నాటికి 15% భూముల్ని సారవంతం చెయ్యాలని నిర్దేశించింది. జీవ వైవిధ్య సంరక్షణలో నగరాలు, స్థానిక ప్రభుత్వాల మధ్య సహకారాన్ని పెంపొందించేందుకు నిర్వచించిన సమాంతర సదస్సు 'హైదరాబాద్ డిక్లరేషన్''ను ఆమోదించింది. ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలను వ్యతిరేకించే స్వచ్ఛంద సంస్థల ప్రజా ఉద్యమ సంస్థల ప్రతినిధులు కూడా హైదరాబాద్‌లో సమావేశమై కాప్ -11కు ప్రత్యామ్నాయ విధానాలపై చర్చించారు. జీవ వైవిధ్య సదస్సు హైదరాబాద్‌లో జరగడం వల్ల తెలుగు ప్రజల అవగాహన పెరగడానికి తోడ్పడింది. మాధ్యమాలు తమ వంతు చర్చను రేకెత్తించాయి. కాని మన రాజకీయ నాయకత్వం మాత్రం తమ సంకుచిత స్వార్థ రాజకీయాలకు ఇచ్చిన ప్రాముఖ్యం జీవ వైవిధ్య సదస్సుకు ఇవ్వకపోవడం తెలుగు ప్రజల దౌర్భాగ్యం. ●

# జీవ వైవిధ్య పరిరక్షణ దిశగా హైదరాబాద్ డిక్లరేషన్

***నగోయా ప్రొటోకాల్ అమలుకు కనీసం 200 బిలియన్ డాలర్లు అవసరమని భావిస్తున్నారు. హైదరాబాద్ సదస్సులో ఆరంభం నుంచి చివరి వరకు ఈ నిధుల వాటా సేకరణపై ఎక్కువ సమయం చర్చించారు. ఫలితంగా కీలకమైన జీవవైవిధ్య సంరక్షణ, జీవ వైవిధ్య దుర్వినియోగంలో బహుళ జాతి సంస్థల పాత్ర, జీవ వైవిధ్య క్షీణత వల్ల తలెత్తుతున్న పర్యావరణ సంక్షోభం వంటి అంశాలను లోతుగా క్షుణ్ణంగా చర్చించలేకపోయారు.***

***జీవవైవిధ్య పరిరక్షణ, అభివృద్ధి ప్రధాన ల్యంగా 2010లో రూపొందించిన నగోయా ప్రొటోకాల్, నగోయా కౌలాలంపూర్ అనుబంధ ఒప్పందాల అమలుకు సంబంధించి శాస్త్రీయమైన కార్యాచరణ ప్రణాళిక పై హైదరాబాద్ సదస్సులో చర్చించి కొన్ని కీలకమైన అంశాలను ఆమోదించారు.***

**సముద్రతీర ప్రాంత జీవవైవిధ్య పరిరక్షణ :**

భూగోళంపై ఉన్న జీవ వైవిధ్యంలో 95% పైబడి సముద్రంలోనే ఉన్నందున మానవ వాణిజ్య అవసరాల కోసం సముద్రజీవులను, సముద్ర సహజ సంపదను ఉపయోగించుకోవడాన్ని తగ్గించాలి. అదేవిధంగా తీరప్రాంతాల్లో పారిశ్రామికీకరణ ఫలితంగా తలెత్తుతున్న కాలుష్య సమస్యకు పరిష్కారం కనుగొనాలి. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. అత్యంత ప్రాముఖ్యత కలిగిన తీర ప్రాంతాలు, ప్రాముఖ్యం కలిగిన జాబితాలోకి కొత్తగా చేరుతున్న తీరప్రాంతాలలో లభించే సహజ సంపద వివరాలకు సంబంధించి సమాచార మార్పిడి, తీరప్రాంత పరిరక్షణకు అవసరమైన సామర్థ్యం పెంపపై సభ్యదేశాలు పరస్పరం సహకరించుకోవడం.

**గ్లోబల్ వార్మింగ్ - వాతావరణ మార్పులు జీవవైవిధ్యం:**

అడవుల నరికివేత, పారిశ్రామికీకరణ వల్ల కలిగే దుష్పరిణామాల వల్ల జీవవైవిధ్యం క్షీణిస్తున్నందున, అడవుల అభివృద్ధికి కృషి చేయడం, వాతావరణ మార్పుల వల్ల జీవవైవిధ్యంపై కలిగే ప్రభావాలకు సంబంధించి సమాచార మార్పిడి.

**వాతావరణఆధారిత జియో ఇంజినీరింగ్:**

గ్లోబల్ వార్మింగ్‌కు కారణమయ్యే గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను తగ్గించడం, అతినీలలోహిత కిరణాలు ఎక్కువగా భూమిని చేరకుండా చూడటం, భూమిపై పెరుగుతున్న కర్బన వాయువుల శాతాన్ని తగ్గించే అన్నిరకాల శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలపై మరిన్ని పరిశోధనలు, పటిష్ట నియంత్రణ.



**జలవనరుల సంరక్షణ:**
పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, సుస్థిరాభివృద్ధి సాధనలో కీలకపాత్ర పోషిస్తున్న జలవనరులను పరిరక్షించుకోవాలి. వర్షపునీటిని గరిష్ట స్థాయిలో వినియోగించుకునే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు జల కాలుష్యాన్ని నివారించే, నియంత్రించే చర్యలకు మరింత చట్టబద్ధత కల్పించాలి.

**ఆధునికీకరణ ప్రభావం:**
ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందేకొద్దీ పారిశ్రామిక ఉత్పత్తుల వినియోగం పెరగడం తత్ఫలితంగా జీవులపై కలిగే ప్రతికూల, అనుకూల ఫలితాలపై నిఘా పెట్టడం ఆధునికీకరణ, పారిశ్రామికీకరణ, పట్టణీకరణల వల్ల జీవవైవిధ్యానికి నష్టం జరగకుండా చూడటం.

**ద్వీపాల్లో జీవవైవిధ్యం:**
ప్రపంచ వ్యాప్తంగా వున్న ద్వీపాల్లో దాదాపు 80 శాతం జీవులు ముఖ్య 40 శాతం వెన్నెముక గల జీవులు అంతరించే దశలో ఉన్నందున వీటి పరిరక్షణ విషయంలో స్థానికుల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు ఈ ప్రాంతాల్లోని జీవవైవిధ్యాన్ని సంరక్షిం చడానికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించడం.

**వన్యప్రాణుల సంరక్షణ:**
మాంసం కోసం జింకలు, దుప్పులు, కుందేళ్లు, పక్షులు, నెమలి వంటి వన్యప్రాణులను వేటాడకుండా నియంత్రించేందుకు మరిన్ని నూతన విధానాలను రూపొందించి పటిష్టంగా అమలు చేయడం.

**నూతన జీవజాతుల ప్రవేశాన్ని నియంత్రించడం:**
జీవవైవిధ్య క్షీణతకు కారణమవుతున్న జన్యుమార్పిడి జంతువులు, మొక్క సృష్టిని నియంత్రించడానికిగాను అంతర్జాతీయ ప్రమాణాలను పాటించడం

**రక్షిత ప్రాంతాలు:**
రక్షిత ప్రాంతాల పరిరక్షణ ద్వారా జీవ వైవిధ్య సంరక్షణ లక్ష్యంగా నగోయా (20 అయిచీ లక్ష్యాలు) ప్రోటోకాల్‌ను అమలు చేయడానికి అవసరమైన సామర్థ్యాన్ని పెంపొందించడానికిగాను శిక్షణ తరగతుల నిర్వహణ, కంప్యూటర్ నెట్‌వర్కింగ్ ద్వారా ఈ లెర్నింగ్‌లో శిక్షణాంశాల రూపల్పన.

**లింగ వివక్ష:**
జీవవైవిధ్య సంరక్షణకు సంబంధించిన అంశాల రూపకల్పనలో ఎలాంటి లింగవివక్షకు తావివ్వకుండా తగిన చర్యలు తీసుకోవడం.

**పేదరిక నిర్మూలన:**
జీవవైవిధ్యాన్ని సంరక్షించడం ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు లభించడం. ఆర్థిక ప్రయోజనం కలగడంతో పాటు, స్థానిక ప్రజలకు అటవీ హక్కులు, భూయాజమాన్య హక్కులు కూడా లభించడం వల్ల పేదరికం తీవ్రత తగ్గుతుంది.

**వాణిజ్య వైవిధ్యం:**
ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేయడం ద్వారా జీవవైవిధ్య సంరక్షణకు అవసరమైన సామర్థ్యాన్ని పెంచుకోవడం.

**స్థానిక సంస్థలు,**
**వాటాదారుల ప్రమేయాన్ని పెంచడం:**
జాతీయస్థాయిలో జీవవైవిధ్య సంరక్షణకు సంబంధించి స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, విద్యార్థులు, స్థానిక వ్యాపార సంఘాలు మొదలు అన్ని రకాల స్థానిక సంస్థలను భాగస్వామ్యులను చేయడం, గ్రామ స్థాయిలో జీవవైవిధ్య యాజమాన్య కమిటీలు, రాష్ట్ర స్థాయిలో జీవవైవిధ్య మండళ్ళ ఏర్పాటుకు అధిక ప్రాముఖ్యతను ఇవ్వడం. జీవ వైవిధ్యం పెంపొందించడానికి దోహదపడే ప్రతి అంశంలోనూ స్థానిక ప్రజలను తప్పనిసరిగా భాగస్వాములను చేయడం, స్థానిక వనరుల ఆధారంగా ఆదాయ వనరులను పెంచుకోవడానికి అవసరమైన సహకారాన్ని అందించడం.

**అంతర్జాతీయ సంస్థల మధ్య సహకారం:**
జీవవైవిధ్య సంరక్షణ, అభివృద్ధికిగాను అంతర్జాతీయ సంస్థల మధ్య పరస్పర సహాయసహకారాలను పెంపొందించుకోవడానికి జీవ వైవిధ్య క్షీణతకు సంబంధించిన సమస్యలపై చర్చించుకోవడానికిగాను 2020 వరకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి అంతర్జాతీయ సదస్సులను నిర్వహించాలని సభ్యదేశాలు ఏకగ్రీవంగా తీర్మానించాయి.

**ప్రభుత్వాలు- అనుబంధ సంస్థల మధ్య సమన్వయం:**
ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా జాతీయ అనుబంధ సంస్థలు శాస్త్ర సాంకేతికపరమైన అంశాలకు సంబంధించి సలహాలు, పరస్పర సహకారాన్ని అందించుకోవడం. ●

# నిత్య జీవితంలో కవిత్వం

**- దీపక రాగం - అదృష్ట దీపక్**

కవిత్వం చెప్పడమంటే మాటలా? నాలుగు అక్షరమ్ముక్కలు నేర్చిన ప్రతివాడికీ కవిత్వం చెప్పడం సాధ్యమవుతుందా? పోనీ- భాషలో అసాధారణ పాండిత్యం ఉన్నంత మాత్రాన అందరినీ కవితాకన్య వరిస్తుందా? అలా అయితే నిఘంటువులన్నీ మహాకావ్యాలుగా చలామణీ అయిపోతాయి. ప్రముఖనటుడూ, రచయితా అయిన మిత్రుడు కీ.శే.పి.ఎల్. నారాయణ ఒకసారి నా హేండ్‌బుక్‌లో "కాగితానికీ కలానికీ మధ్య సిరా మాత్రం పట్టే జాగాలో సర్వ ప్రపంచాన్నీ నిక్షిప్తం చేయగల శక్తి కవిత్వం" అని రాశాడు.

నిజమైన కవిత్వానికి అందరూ అంగీకరించిన నిర్వచనం ఏదీ కనిపించడంలేదు. ప్రాచీన అలంకారికులలో ప్రముఖుడైన జగన్నాథ పండితరాయలు "రమణీయార్థ ప్రతిపాదన శబ్దాలను" కవిత్వంగా పేర్కొన్నాడు. విశ్వనాథుడు "రసాత్మకమైన వాక్యాలను" కవిత్వంగా నిర్వచించాడు. ఆనందవర్ధనుడు కూడా "రసానుభవ్రతి కలిగించే ధ్వని- కావ్యానికి ముఖ్య లక్షణం" అన్నాడు. మమ్మటుడు - "వ్యంగ్య ప్రధానమైనదే ఉత్తమ కావ్యం" అన్నాడు. భామహుడు, కుంతకుడు మొదలైనవారు "వక్రోక్తి" కవిత్వంలో ప్రధాన పాత్ర వహిస్తుందన్నారు. ఇంకా చాలామంది చాలా రకాలుగా చెప్పారు. ధ్వని అయినా, వక్రోక్తి అయినా మొత్తంమీద కవిత్వం అంటే ఒక విషయాన్ని సూటిగా కాకుండా డొంక తిరుగుడుగా చెప్పడం అన్నమాట! దీనికే సి.నారాయణ రెడ్డి ''ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు, ప్రయోగములు" అనే పరిశోధన గ్రంథంలో "తెలుగున సీతయనుటకు బదులుగా - కడలి మొలనూలి చేడియకన్నపడతి - యన్నట్లు" ఉందని చమత్కారమైన ఉదాహరణ కూడా ఇచ్చారు.

కవుల మాటల్లోనూ, ఉపన్యాసాల్లోనూ, ఉత్తరాల్లోనూ కూడా మంచి కవిత్వం ప్రవహిస్తూ ఉంటుంది. 70 దశకంలో "ఫాల్ ఫాల్" అనే కథతో సంచలనం సృష్టించిన యువ కథా రచయిత జంపన పెద్దిరాజు ఆత్మహత్య చేసుకోవడానికి కొద్దిరోజుల ముందు ప్రముఖ రచయిత స్మైల్‌తో "ఏమిటో... కడుపులో గడ్డం పెరిగినట్టు చాలా చికాకుగా ఉంటోంది" అన్నాడట! "ఆ మాటల్లో కవితాస్పర్శ ఎంతో గొప్పగా ఉందనుకున్నాను. కానీ ఇలా అర్థాంతరంగా జీవితాన్ని ముగించుకుంటాడని ఊహించలేదు. ఆ మాట వెనుక తీవ్రతను గ్రహించ లేకపోయాను" అని స్మైల్ ఎన్నోసార్లు బాధపడడం నాకు తెలుసు.

మంచి కవిత్వం కావాలంటే నిరుపహతిస్థలమూ, రమణీప్రి దూతిక తెచ్చు ఇచ్చు కప్పురపు విడెము, ఆత్మకింపయిన భోజనమూ, ఊయల మంచమూ... ఇంకా ఏవేవో కావాలన్నాడు అల్లసాని పెద్దన్న. పైన చెప్పిన ఏర్పాట్లన్నీ చేస్తే కవిత్వం బదులు సుఖంగా నిద్ర వస్తుందని నా అనుమానం.

నిత్య జీవితంలో పాండిత్యానికీ, శాలువాలకూ, గండపెండేరాలకూ ఏ మాత్రం సంబంధం లేని మామూలు మనుషుల మాటల్లో అద్భుతమైన కవిత్వం తొంగిచూస్తుంది. మంచినీటి కుళాయిల దగ్గర పోట్లాటల్లో భాగంగా ఆడవారి తిట్లలో పొంగిపొరలే ఉపమానాలూ, చమత్కారాలూ, వెటకారాలూ ఏ మహాకవి ప్రయోగాలకూ తీసిపోనంత గొప్పగా ఉంటాయి. "కోడిని తిన్న బావురు బిల్లిలాగ ఆ మొఖం చూడు" అనే మాటలోని తిట్టును కాదు- ఉపమానాన్ని గమనించండి. "నీ యింట్లో ఎవరో ఒకరు చచ్చిపోవాలి" అని డైరెక్టుగా తిట్టకుండా "నీ యింట పీనుగు వెళ్ళాలి" అంటారు. "నువ్వు చచ్చిపోవాలి" అనకుండా "నీ అమ్మ కడుపు కాలిపోనూ" అంటారు. శ్రోత్రియకుటుంబాలలో తిట్లలో కావలసినంత కవిత్వం దొరుకుతుంది. ఎవరి మీదయినా కోపం వస్తే "నీ మొహం మండా" అని తిడతారు. ఇక్కడ గమనించవలసిన అంశం- చితిమీదకు చేరిన తరువాతనే కదా ముఖం మండేది! ఒకపనిలో అంత ప్రాముఖ్యం లేనివాడిని "తద్దినం పెట్టేవాడి తమ్ముడు" అని చమత్కరిస్తారు.

మామూలుగా మనం మాట్లాడే మాటల్లో దొర్లిపడే కవిత్వాన్ని మనం అంతగా పట్టించుకోము. ఏదైనా విషయాన్ని నొక్కి చెప్పడంలో కూడా కవిత్వం తొణికిసలాడుతుంది. "అబ్బ- ఉపన్యాసం దంచేశాడు!" అంటాం. ఉపన్యాసం అనేది రోటిలో

వేసి దంచే వస్తువు కాకపోయినా "దంచేశాడు" అనే ప్రయోగం వలన ఆ ఉపన్యాసంలోని తీవ్రతా, వేగమూ మనకు బాగా అర్థమవుతాయి.

కోపం వచ్చిన అమ్మ ఇంట్లో పిల్లలతో ''నన్ను విసిగిస్తున్నారు" అంటే అందులో ఏ విశేషమూ ఉండదు. "నన్ను చంపుకు తింటున్నార్రా వెధవల్లారా!" అంటే ఆ చికాకు పూర్తి స్థాయిలో మనకు అందుతుంది. నిజానికి చంపడమూ, తినడమూ రెండూ అతిశయోక్తులే కదా! "కొంచెం కాఫీ నీళ్ళు నా మొహాన తగలేస్తావా?" అనే వాక్యం కూడా ఇలాంటిదే! లంచం తీసుకోవడాన్ని గడ్డి తినడంగా పేర్కొంటారు. ఆ లంచమే లాంఛనమై మన సమాజంలో సర్వసాధారణమై పోయింది. కనుక ఇప్పుడు ''మామూలు'' అనే పదం వాడుకలోకి వచ్చింది.

"ఈ వేళ పొయ్యిలో పిల్లి లేవలేదు" అనే పదం వాడుకలోకి వచ్చింది. ఇలాంటి మాటలను పరిశీలిస్తే సమాజపరిణామక్రమం మనకు బాగా అర్థమవుతుంది. గ్యాస్టవ్‌లు లేని రోజుల్లో పల్లెటూళ్లలో (ఆమాటకొస్తే ఇప్పుడు కూడా) పొయ్యి మండించడానికి పిడకలూ, పుల్లలే ఆధారంగా ఉండేవి. అవి కాలి బూడిదయ్యాక ఆ వెచ్చదనం కోసం పిల్లులు వచ్చి పొయ్యిలో సుఖంగా పడుకునేవి. మళ్లీ వంట చేసుకునే ముందు ఇంటి ఇల్లాలు పొయ్యిలో పడుకున్న పిల్లిని లేవగొట్టి బయటికి తరిమేసేది– ఇదీ కథ!

ఎదుటివాడు నోరు విప్పే అవకాశం ఇవ్వకుండా తీవ్రమైన స్థాయిలో విమర్శిస్తే "ఏకి పారేశాడు", "దుమ్ము దులిపేశాడు" అనే ప్రయోగాల్లో కవిత్వం లేదంటారా? కొన్ని కులాలనూ, వృత్తులనూ బట్టి కొత్త కొత్త ప్రయోగాలు పుడుతుంటాయి. విభిన్న కులాల సామాజిక నేపథ్యంలోంచి వచ్చిన చమత్కారమైన ప్రయోగాలెన్నో జనజీవనంలో కలిసిపోతాయి. ఎవరైనా ఒక పని పూర్తిగా మానేస్తే "నువ్వులూ, నీళ్ళూ వదిలేశాడు" అంటారు. ఇది వైదికుల కర్మకాండకు సంబంధించి – తిలోదకాలతో తర్పణం వదిలే అంశం నుంచి పుట్టింది. ఏదైనా విషయం సరిగ్గా లేకపోతే "నా పిండాకూడులా ఉంది" అనే ప్రయోగం కూడా వైదిక భాషనుంచి వచ్చిందే! ఎక్కడా ఆపకుండా తిడుతూ ఉంటే "దండకం మొదలెట్టాడండీ" అంటారు. ఎవరైనా వచ్చి బూతులు మాట్లాడుతుంటే "బొత్తిగా సంస్కృతం మాట్లాడుతున్నాడు" అనడంలో ఉన్న వ్యంగ్యం తెలుస్తూనే ఉంది కదా! సినిమారంగానికి సంబంధించిన వాళ్లు భోజనాలు చేసేటప్పుడు పెరుగన్నం అనడానికి బదులు "క్లైమాక్స్" అని వ్యవహరిస్తున్నారు.

మనిషి జీవితంలో అనుభవాలూ, అనుభూతులూ కలిసి ఏర్పడిన సామెతల్లో ఉండే కవితాంశ మనకు తెలిసిందే! "ఇంటి పేరు కస్తూరి వారు – ఇంటినిండా గబ్బిలాల కంపు", "అందరూ శ్రీ వైష్ణవులే – బుట్టలో రొయ్యలు మాత్రం మాయం", "అత్తలేని కోడలు ఉత్తమురాలు – కోడలు లేని అత్త గుణవంతురాలు" – మొదలైన అనే సామెతల్లో నిశితమైన వ్యంగ్యమూ, చమత్కారమూ పుష్కలంగా కనిపిస్తాయి.

మా ప్రాంతంలో స్వార్థపరుడైన ఓ రాజకీయ నాయకుడు చీటికి మాటికీ పార్టీలు మారుతుంటాడు. ఏ విషయంలో అయినా తన మాట చెల్లకపోతే "ఎన్నోసార్లు" ఆమరణ నిరాహార దీక్షలు మొదలు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుంటాడు. అతని గురించి ఓ సామాన్య వ్యక్తి "ఇలాంటి వాడు ఉండకూడదు. వీడు దేశానికి చాలా బరువండి!'' అని వ్యాఖ్యానించాడు. ఆ మాటల్లోని కవితాభివ్యక్తికి ఆశ్చర్యపోయాను.

అచ్చమైన జీవన నేపథ్యాన్నీ నుడికారాన్నీ ప్రతిబింబించే కవితాత్మకమైన పదాలెన్నో సామాన్య జనం మాటల్లో దొర్లుతుంటాయి. ఏ భాషలో అయినా ఇలాంటి ప్రయోగాలను దృష్టిలో ఉంచుకునే మహాకవి శ్రీశ్రీ ''నిజమైన కవిత్వం అనువాదానికి లొంగదు'' అన్నాడు. ఎందుకంటే ఇవి నిఘంటువులకెక్కని కవిత్వ శకలాలు! ●

## నవయుగాల బాట నార్ల మాట

*పదవి, పదవి యనుచు పలవరించు నరుడు*
*ప్రజలదృష్టి నెంతో పలచబడును:*
*కూర్చగలవు కీర్తి కోరని పదవులే!*
*నవయుగాల బాట నార్ల మాట*

*పదవితోనె చెల్లు పదవి తెచ్చు ఘనత;*
*పిదప మిగలునోయి మొదటిరూపు:*
*తోలుబొమ్మ శోభ తూరుపారక ముందె*
*నవయుగాల బాట నార్ల మాట*

# విలువలు గల రాజకీయాల కోసం లోక్‌సత్తా పార్టీలో సభ్యులుగా చేరండి

### పార్టీకన్నా దేశం మిన్న......

సంప్రదాయ పార్టీలు విలువల్ని విస్మరి స్తున్నాయి. ఓట్లయావ తప్ప వాటికి విధానాల ధ్యాస లేదు. కులం, మతం, ప్రాంతం, భాషా సమస్యలు ఈ పార్టీల సంకుచిత ప్రయోజనాలకు సాధనాలవు తున్నాయి. దేశ ప్రయోజనాలకు హాని చేస్తున్నాయి.

లోక్‌సత్తా పార్టీకి విలువలు ప్రాణం-జనహిత విధానాలు ఊపిరి పార్టీ ప్రయోజనాలకన్నా దేశ ప్రయోజనాలే మిన్న అని ప్రకటించిన ఏకైక పార్టీ లోక్‌సత్తా పార్టీ.



సభ్యులే నడిపించే పార్టీలో నాయకులుగా

### లోక్‌సత్తా దారి వేరు... తీరు వేరు

- లోక్‌సత్తా పార్టీకి సత్యం-అహింసలే ఆయుధాలు.
- సమస్యల్ని విశ్లేషించడం, మూలాలను కనుగొనడం ఆచరణ యోగ్యమైన పరిష్కారాలను అవి ప్రియమైనా, అప్రియమైనా సత్యాలనే ప్రకటిస్తుంది.
- బంద్‌లు చెయ్యదు, రాస్తారోకోలకు పాల్పడదు. ఇతరుల స్వేచ్ఛకు భంగం కలగని రీతిలో ప్రజల్ని చైతన్యపరిచే ఉద్యమాలు సాగిస్తుంది.

# ఇక్కడ వారసులు లేరు మీరే నాయకులు

- సమాజం చుట్టూ తిరగాల్సిన రాజకీయ పార్టీలు ఇప్పుడు కుటుంబాల చుట్టూ, వారసుల చుట్టూ తిరుగుతున్నాయి. లోక్‌సత్తా పార్టీ ఏ ఒక్కరి ప్రయివేటు ఆస్తి కాదు. ఇక్కడ వారసులు లేరు. ఇది సభ్యుల పార్టీ, వారే నిర్వహించుకునే పార్టీ. సభ్యులు ఎన్నుకున్న వారే నాయకులు.

  మీరూ సభ్యులుగా చేరండి... పార్టీకి సేవలందించండి. నాకులుగా ఎదగండి.

### స్వయం ప్రతిపత్తిగల ఎన్నికల అధారిటీ

- అంతర్గత ఎన్నికల కోసం ఎన్నికల నిర్వహణలో అనుభవం వున్న పార్టీయేతర ప్రముఖులతో ఒక స్వయం ప్రతిపత్తి గల ఎన్నికల అధారిటీని లోక్‌సత్తా పార్టీ ఏర్పాటు చేసింది. వీరే అంతర్గత ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహిస్తారు.



- కొత్త రాజకీయం కోసం అందరూ సభ్యులుగా చేరండి లోక్‌సత్తాలో నాయకులుగా ఎదగండి.

**సూచన:** మీరు, మీ స్నేహితులు ఎవరైనా లోక్‌సత్తా పార్టీలో చేరదలచుకుంటే ఇక్కడ పొందుపరచిన సభ్యత్వ ఫారాన్ని ఉపయోగించుకోవచ్చును. పూరించిన దరఖాస్తును ఇం.నం. 8-2-674బి/2/9, ప్లాట్ నం. 93హ్యాపీవ్యాలీ, రోడ్‌నం.13ఎ, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034 రాష్ట్ర కార్యాలయానికి పంపించండి.

APPLICATION NO.:
LSP/PRI/

**Rs. 100/-for 3 Years.**
(Rupees one hundred only, for three years)

# LOK SATTA PARTY
**New Politics for a New Generation**

## ACTIVE MEMBERSHIP
**Application Form**

PHOTO

FULL NAME ______________________
FAMILY NAME / NAME

## PERSONAL DETAILS

DATE OF BIRTH : ___/___/___ (dd / mm / yyyy)

GENDER: M ☐ F ☐

MARITAL STATUS: ☐ Single ☐ Married

SOCIAL CATEGORY (for statistic purpose only) ☐ O.C ☐ B.C ☐ S.C ☐ S.T

EDUCATIONAL QUALIFICATION : ___________

PROFESSION: ___________

GROSS ANNUAL INCOME: ___________

## CONTACT DETAILS

H.NO: ________ STREET NAME: ________

AREA: ________ PIN: ________

MANDAL/ DIVISION: ________ DISTRICT : ________

ASSEMBLY CONSTITUENCY: ________

POLING STATION NAME / No. : ________ STATE: ________

TEL: ________ MOBILE: ________

EMAIL: ________

Referred by: ________

His/Her ID No.: ________

**Volunteer Name :** ________

Ph. No. : ________ Signature: ________

**UNDERTAKING**

I confirm that the information furnished above is true to the best of my knowledge and that I read the terms & conditions set forth in the membership document and I shall abide by the same and shall be subject to the disciplinary code of the party. I affirm that I do not have any criminal record on me. I have paid the prescribed membership fee.

DATE: ________ SIGNATURE: ________

# సురాజ్య లక్ష్యం కోసం సమష్టిగా పనిచేద్దాం

## మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు




### తూర్పుగోదావరి

సురాజ్య ఉద్యమంపేరుతో లోక్‌సత్తా ప్రవేశపెట్టిన ఉద్యమంలో మనమంతా సమష్టిగా పనిచేద్దామని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. ఓటు, డబ్బు మధ్య అపవిత్ర బంధం వచ్చింది. ప్రజల్లో చైతన్యానికి బదులుగా వ్యక్తిగత స్వార్థం ప్రబలిపోయి తాత్కాలిక ప్రయోజనాలకు పరిమితమౌతున్నారు. వ్యవస్థల్లో పారదర్శకతకు ఏర్పాటు జరగనంతకాలం అవినీతి జాడ్యం పోదు. బడి నుంచి, కళాశాల నుంచి ఈ మార్పుకు శ్రీకారం చుట్టాలి. బాధ్యత గల పౌరుడిగా సురాజ్య లక్ష్యాలకై మీతో చేయికలిపి ఉద్యమిస్తాను.

డాక్టర్ స్టాలిన్ మాట్లాడుతూ మార్పు రావాలి. దీనిపై అందరూ ఏకాభిప్రాయానికి వచ్చాం. మార్పు లేకున్నా బ్రతుకుతాం కానీ సంతృప్తిగా ఆనందంగా బ్రతకడం సాధ్యం కాని స్థితి. ఆమోదయోగ్యమైన ఉమ్మడి లక్ష్యాల మేరకు మనసు పెట్టి పనిచేస్తే మంచిమార్పు సాధ్యమే. యువత చాలా మంచి ఆకాంక్షలతో వున్నారు. వాళ్లను దిశానిర్దేశం చేస్తే మార్పు వేగవంతం అవుతుంది. ఆ ప్రయత్నం చేద్దాం.

రాష్ట్ర సురాజ్య ఉద్యమ బాధ్యులు డి.వి.వి.యస్. వర్మ, వై.డి రామారావు, పాలడుగు సుబ్రహ్మణ్యం, తదితరులు మాట్లాడారు. మన ఊళ్లో సురాజ్యం పేరుతో స్థానిక మోదరన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో గరిగిపాటి సూర్యనారాయణ మూర్తి, కొమరిన వీర్రాజు, మోదరన్ అధినేత జి.వి.రావు, లోక్‌సత్తా ఉద్యమ జిల్లా సమన్వయకర్త ఉప్పలపాటి మాచిరాజు, చెలంకూరి నాగేశ్వరరావు, చిలుకూరి సత్యనారాయణ, వి.వి. రామారావు, ఎం.వి. రమణమూర్తి, పట్టాభి రామారావు, కాకుళవరపు రామచంద్రరావు, బి.వి.బి.ఎల్. నారాయణ, బిక్కిన వెంకటేశ్వరరావు, మార్ని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రుల సేవలు వినియోగించుకోవాలి



## నందికొట్కూర్

ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి నరసింహులు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి సురాజ్య ఉద్యమం సభ్యులు ఉచితంగా అందజేసిన ఇన్‌వర్టర్‌ను ప్రారంభించేందుకు ఆయన నందికొట్కూరుకు వచ్చారు. ప్రారంభం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ నందికొట్కూరు ఆసుపత్రి అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం రూ. 40 వేల నిధులు ఉన్నాయన్నారు. మరో రూ. 2.50 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అభివృద్ధి నిధులు రూ. 2.50 నుంచి రూ. 5.40 లక్షలకు పెంచినట్లు చెప్పారు. నెల రోజుల్లో సిబ్బంది కొరతను తీరుస్తామన్నారు. అనంతరం ఎస్సై కృష్ణయ్య, స్వరాజ్య ఉద్యమ రాష్ట్ర బాధ్యులు బండారు రామ్మోహన్‌రావు, లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి ఓంకార్, నందికొట్కూరు నాయకులు సుందరరావు, మురళీకృష్ణ, మహమ్మద్ షరీఫ్, చెన్నయ్య వైద్యులు దేవసాగర్ ప్రసంగించారు. కార్యక్రమంలో స్వరాజ్య ఉద్యమం నాయకులు, కార్యకర్తలు సభ్యులు పాల్గొన్నారు.

# అవినీతి అంతానికి కదలండి



## బనగానపల్లి

దేశంలో పెచ్చు పెరిగిపోతున్న అవినీతి అంతానికి యువత ముందుకు రావాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీ.ఆర్.జగన్నాథ రెడ్డి, విద్యాసత్తా రాయలసీమ సమన్వయకర్త శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కంకరగుర్రెడ్డి డిగ్రీ కళాశాలలో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో సురాజ్య ఉద్యమంలో భాగంగా విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రోజు రోజుకీ అవినీతి ఎక్కువై పోతోందన్నారు. లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అవినీతిఅంతం కోసం చేస్తున్న పోరాటాన్ని గుర్తుచేశారు. అనంతరం స్థానిక పింఛనర్ల సంఘం అధ్యక్షుడు పి. సంజీవరెడ్డి, న్యాయవాది టి. మాధవరెడ్డి, బీసీ సంఘం నాయకులు శ్రీరాములు, మాజీ సర్పంచి లక్ష్మిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సదాశివమూర్తి, న్యాయవాది హరికృష్ణారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

# బస్టాండ్ సమస్యలపై సురాజ్య కమిటీ వినతి



కదిరి

కదిరి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సురాజ్య ఉద్యమకమిటీ నాయకులు స్థానిక డిపో మేనేజర్ ఉదయశ్రీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరుగుదొడ్ల అపరిశుభ్రత కారణంగా కంపుకొడుతున్నాయని, ప్రతినిత్యం వేలాది మంది ప్రయాణికులు బస్టాండ్ ద్వారా రాకపోకలు సాగిస్తుండగా వారికి అవసరమైనన్ని టాయిలెట్స్ లేక మహిళా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నట్లు డి.ఎం.దృష్టికి తెచ్చారు. అదే విధంగా గ్రామీణ ప్రాంత ప్రయాణికులకు వర్షాకాలం, ఎండాకాలం వర్షానికి తడవడం, ఎండలకు ఇబ్బందిపడడం తప్పడం లేదని షెడ్‌ను నిర్మించాలని కోరారు. అంతే కాకుండా బస్టాండ్ ఆవరణలో అపరిశుభ్రత వాతావరణం కారణంగా ప్రయాణికులు ముక్కులు మూసుకోవాల్సి వస్తోందని డి.ఎం.దృష్టికి తెచ్చారు. దీని పై స్పందించిన డి.ఎం.ఉదయశ్రీ, సి.టి.ఎం.మధు సూదన్‌లు ఉన్నతాధికారులకు నివేదికలు పంపి చర్యలు చేపడుతామని సురాజ్య ఉద్యమ కమిటీ నాయకులకు హామినిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రామాంజనేయులు, ఎన్.వి.రత్నం, జె.రెడ్డెప్ప, హేమంత్, జి.మన్సూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

---

# లోక్‌సత్తా నాయకున్ని పరామర్శించిన నాయకులు




రాయదుర్గం

రాత్రి మండలంలోని వేపరాల క్రాస్ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన లోక్‌సత్తా పార్టీ తాలుకా కార్యదర్శి బి.వెంకటరమణ(బాబు)ను స్థానిక సిపిఐ నాయకులు పరామర్శించారు. వివరాల మేరకు రాత్రి కళ్యాణదుర్గం నుండి రాయదుర్గంకు ద్విచక్ర వాహనంపై వస్తున్న బాబు, అతని స్నేహితుడు భాషాలు వేపరాలక్రాస్ వద్ద అనంతపురం ప్రధాన రహదారిపై వారు వస్తున్న వాహనానికి అకస్మాత్తుగా గేదెలు అడ్డు రావడంతో జరిగిన ప్రమాదంలో బాబు తలకు తీవ్రగాయాలు కాగా, భాషాకు స్వల్ప గాయాలైయాయి. స్థానిక 108కు సమాచారం అందించడంతో రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న సిపిఐ పట్టణ కార్యదర్శి నాగార్జున, మైనారిటీ సంఘం నాయకుడు మాబుసాబ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు గోవర్ధన్, అనిల్, పట్టణ పాత్రికేయుల సంఘం అధ్యక్షులు గౌరవ శ్రీనివాసులు, పాత్రికేయులు నవీన్, బాబు స్నేహితులు జయప్రభ తదితరులు ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు.

# ప్రజాసమస్యల పరిష్కారాలపై మున్సిపల్ ప్రజాకౌన్సిల్



## గుంతకల్

సురాజ్య ఉద్యమంలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ప్రజాకౌన్సిల్ ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర సురాజ్య ఉద్యమనేత బండారు రామ్మోహన్‌రావు అన్నారు. గుంతకల్ పట్టణంలోని ట్రావెలర్స్ బంగళాలో ఏర్పాటుచేసిన సురాజ్య ఉద్యమ ప్రజాకౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సురాజ్య ఉద్యమ పట్టణ కన్వీనర్ మహమ్మద్‌గౌస్ అధ్యక్షత వహించారు. పన్నులు కట్టేది మనం-ఓటు వేసేది మనమే ప్రభువులం కావాలని సురాజ్య లక్ష్యాలను ఆయన వివరించారు. ఇంటిముందు ప్రభుత్వం చేయాలని, మున్సిపాలిటీ ఎన్నికలను బలోపేతం చేయాలని రామ్మోహన్‌రావు కోరారు. మున్సిపాలిటీ ఎన్నికలు రెండేళ్ళుగా వాయిదావేస్తూ ప్రభుత్వం చోద్యం చూస్తుందని ఆయన విమర్శించారు. వెంటనే ఎన్నికలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో పంచాయతీ నుండి జిల్లా పరిషత్ వరకు ప్రజా ప్రతినిధులు లేక రాష్ట్రంలో ఎమ్మెల్యేల రాజ్యం నడుస్తుందన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజల సమస్యలు గాలికి పోతున్నాయని మాజీ కౌన్సిలర్ల ఎన్.రామాంజనేయులు (అండి) మాష్టారు తిమ్మప్ప, రామచంద్ర, ఎమ్. విద్యారాణి, బి.శ్రీనివాసులు (సి.పి.ఎమ్) పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రజల మౌలిక సమస్యలు తీరాలంటే వెంటనే ప్రజాస్వామ్య పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. మాజీ మార్కెట్ ఛైర్మన్ జి.దేవేంద్ర మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం, మంచినీరు, రోడ్లు, మురుగుదొడ్లు లాంటి అనేక సమస్యల పరిష్కారానికి ప్రజాకౌన్సిలర్లు తోడ్పడాలన్నారు. ప్రజాకౌన్సిల్ ఏర్పాటు, వాటి నిబంధనలను కన్వీనర్ మహ్మద్‌గౌస్ వివరించారు. సురాజ్య ఉద్యమాన్ని మనమే నడుపుకోవాలని దానికి సురాజ్యనిధి ఏర్పాటు చేసుకోవాలని ఎస్.రామ్మోహన్ (కోశాధికారి) అన్నారు. ఈఉద్యమంలో గుంతకల్ కమిటీ అధ్యక్షులు డి.రాజశేఖరరడెడ్డి, ఉపాధ్యక్షులు జంగా సురేంద్ర, కె.కృష్ణా, డి.మనోహర్, గోపాల్, బి.విజయరాజు తదితరులు పాల్గొన్నారు. గుంతకల్ పట్టణ ప్రజాకౌన్సిల్‌గా ఎమ్.విద్యారాణిని సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

---

# రాయదుర్గంలో ప్రజాకౌన్సిల్

## రాయదుర్గం

సురాజ్య ఉద్యమం తరపున రాష్ట్రంలో మున్సిపల్ ప్రజాకౌన్సిల్స్, పార్టీలకు అతీతంగా ఏర్పాటుచేస్తున్నామని, మన ఊళ్ళో సురాజ్యంపేరుతో పౌరవసతులు, మౌలిక సౌకర్యాలు, సేవలపై పట్టణంలోని ప్రజాసంఘాలు రాజకీయపార్టీల ప్రతినిధులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, వైస్‌ఛైర్మన్లు, ఛైర్మన్‌తోపాటు ఆశక్తి కలిగిన పౌరులతో కూడిన ప్రజాకౌన్సిల్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను ఏప్పటికప్పుడు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సురాజ్య ఉద్యమ రాష్ట్ర నేత బండారు రామ్మోహన్ రావు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా లోక్‌సత్తా నాయకులు డా॥జె.శ్రీనాథ్, నియోజక వర్గ ఇన్‌ఛార్జీ వెంకటరమణబాబు, అబ్దుల్లా, మహిళాసత్తా జిల్లా అధ్యక్షులు నంద్యాల సరస్వతి, రాఘవేంద్రమ్మ, అబ్దుల్‌రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



# అవినీతి పార్టీల అంతంతోనే సమాజంలో శాంతి

## హైదరాబాద్

అవినీతి కుంభకోణాలకు పాల్పడే పార్టీలకు చరమగీతం పాడినప్పుడే సమాజంలో శాంతి వెల్లి విరుస్తుందని లోక్‌సత్తా అధినేత, ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ్ అన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని లోక్‌సత్తా పార్టీ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో అవినీతి, వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా అవినీతి నరకాసురుడిని దహనం చేశారు. రాష్ట్రంలో దోచుకొని దాచుకోవడమే కాదు.. వారసులకే అధికార పగ్గాలు అప్పజెప్పే దుస్థితిలో పార్టీ నేతలు ఉన్నారని జేపీ విమర్శించారు. కోట్లు ఖర్చుపెట్టి ఓట్లు సంపాదించుకోవాలనే ఇక్కడి ధోరణిని చూసి ప్రపంచ దేశాలు నవ్విపోతున్నాయని చెప్పారు. అన్ని రంగాల్లో మన దేశం కంటే భేషుగ్గా ఉందంటూ చైనాకు కితాబిచ్చారు. పండుగులకు అధునికతను జోడించాలని, ఆధునిక రాక్షసులను వధిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. దేశాన్ని మార్చాలంటే తొలుత వ్యవస్థ మారాలన్నారు. జాతీయతను పెంపొందించేందుకు తిలక్ నాడు వినాయక నిమజ్జనోత్సవాలు నిర్వహించారని, అవినీతిని అంతం చేయడానికి లోక్‌సత్తా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతోందన్నారు.



# ప్రభుత్వం మౌలిక బాధ్యతలు విస్మరించింది

## హైదరాబాద్ లో మహిళా రౌండ్‌టేబుల్

ప్రభుత్వ మౌలిక బాధ్యతలను విస్మరించిందని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ విమర్శించారు. ప్రజలకు రక్షణ, మౌలిక వసతుల కల్పన, విద్య వైద్యం అందించడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుతం పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సురాజ్య ఉద్యమంలో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన మహిళల రౌండు టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల్లోనూ పిల్లలకు సరైన విద్య అందట్లేదన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు అవసరమైన రక్షణ కల్పించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇతర దేశాల్లో ప్రతి లక్షమందికి 10 మంది న్యాయమూర్తులు ఉండగా మన దేశంలో ఒక్కరే ఉన్నారన్నారు. రాష్ట్రంలో పౌరసేవలు సక్రమంగా అమలయ్యేలా చూస్తే కొంత విజయం సాధించినట్టేనని అభిప్రాయపడ్డారు. పార్టీల కతీతంగా అందరూ కలిసి సురాజ్యాన్ని సాధించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావు మాట్లాడుతూ... మహిళలు చట్టసభల్లో మూడో వంతు ప్రాతినిధ్యం వహించడాన్ని చూశాకే తాను కన్ను మూస్తానన్నారు.

ఎమ్మెల్సీ నాగేశ్వర్ మాట్లాడుతూ సమాజాన్ని మార్చే శక్తి రాజకీయ వ్యవస్థకు మాత్రమే ఉందన్నారు.

ఈ సమావేశంలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయకర్త టి.ఎల్.నర్సింహా రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు, మహిళాసత్తా నాయకురాలు కె.గీతామూర్తి, పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి నిర్మల, జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ రమాదేవి, మహాలక్ష్మీ, సత్యాబాయి, జోసెఫ్, లీలా సావిత్రి, హైమాప్రవీణ్, పద్మాభూపతిరాజు, తులసీ నెహ్రూ, కీర్తి, లలితకుమారి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు భాష, భావ వ్యక్తీకరణపై దృష్టి సారించాలి : జేపీ



విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా మంచి భాష, భావ వ్యక్తీకరణ నేర్చుకోవాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ అన్నారు. నవంబర్ 15న సనత్‌నగర్ లోక్‌సత్తా పార్టీ ప్రతినిధి హైమాప్రవీణ్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ సెంట్ థెరిసా ఉన్నత పాఠశాలలో ఇంటర్ స్కూల్‌లో వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సనత్‌నగర్ ప్రాంతాలనికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 'భారత జాతీయోద్యమంలో 'నెహ్రూ పాత్ర' అనే అంశంపై పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ విద్యార్థులకు సమాజంపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. అందుకోసం ప్రత్యేకంగా పుస్తకాలను, చరిత్రలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే పాఠశాలలో చదువుకున్న లోక్‌సత్తా నాయకురాలైన హైమా ప్రవీణ్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. వక్తృత్వ పోటీల్లో ప్రథమ బహుమతి మేఘన, ద్వితీయ, తృతీయ బహుమతులను నాగసాయి, శాలిని పొందారు.

# విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



**హయత్‌నగర్**

లక్ష్యాన్ని నిర్దేశించుకొని కృషి పట్టుదలతో చదివి విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని లోక్‌సత్తా పార్టీ నాయకులు సంజీవ్ అన్నారు. హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆయన సొంత ఖర్చుతో కెరీర్ గైడెన్స్‌కు సబంధించిన పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి అనంతరం ఆర్థిక పరిస్థితులు, సరైన మార్గదర్శకం లేక చదువులను మధ్యలోనే నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులతో పాటు ఉపాధికి అవకాశాలు ఉన్న కోర్సుల్లో చేరడం ద్వారా ఆర్థిక ఇబ్బందులను అధిగమించవచ్చని సూచించారు. వీటికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పదో తరగతి తరవాత పుస్తకంలో పొందుపరచి ఉన్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్మోహన్, పాఠశాల కమిటీ మాజీ అధ్యక్షుడు కుమార్, లోక్‌సత్తా ప్రతినిధులు కృష్ణ, సురేష్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు చెన్నకేశవరెడ్డి, బాలకృష్ణ, శ్రీనివాస పాల్గొన్నారు.

# గ్రంధాలయాలకూ బి.ఓ.టి లేనా?

## రౌండు టేబుల్ సమావేశంలో పెద్దల తీర్మాణం!




విశాఖపట్నం జిల్లా గ్రంథాలయం స్థలంలో మంత్రి గంటాంకు చెందిన ప్రత్యుష కంపెనీకి నూతన కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి బి.ఓ.టి పద్ధతిపై 33 సంవత్సరాల లీజుకివ్వడాన్ని రద్దు చేయాలని రౌండు టేబుల్ సమావేశంలో పాల్గొన్న ముఖ్య వక్తలు పేర్కొన్నారు. లోక్‌సత్తా పార్టీ పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశం లో వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు గ్రంథాలయాల పాఠకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురాజ్య ఉద్యమ సమన్వయకర్త ఎం.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయంలోనూ తన భవణం నిర్మాణానికి గ్రంథాలయ సంస్థ వద్ద సరిపోయే నిధులు ఉన్నప్పటికీ ప్రైవేటు కంపెనీకి అనుమతులివ్వడం విడ్డురంగా ఉందని ప్రముఖ విద్యాసంస్థ ప్రిజమ్‌కాలేజీ ప్రిన్సిపాల్ ఉమాబాల మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయ పాఠకులకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా ప్రభుత్వానికి తమ వ్యతిరేకతను తెలియ చెప్పాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నగర అధ్యక్షులు సురేష్‌కుమార్, ఉపాధ్యక్షులు నాయుడు వేణుగోపాల్, జాయ్, శ్రీదేవి, ఎమ్.వి.శర్మ, రెడ్డిలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

---

# ముంపునకు గురైన పట్టించుకోరెందుకు

**విజయనగరం కంటోన్మెంట్**

పట్టణంలోని 24వ వార్డు రైల్వేస్టేషన్ ప్రాంతం సున్నంబట్టివీధి తుఫాను కారణంగా ముంపునకు గురైంది. ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముంపునకు గురైన ప్రాంతాన్ని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ సందర్శించారు. పట్టణంలోని 27వ వార్డులో తుఫాను కారణంగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా జిల్లా అధికారులు కన్నెత్తి చూడకపోవడం శోచనీయమన్నారు. వార్డులో ప్రధాన కాలువలన్నీ జనధికారికంగా వాటిపై కట్టడాలు కట్టడం వల్ల నీరు నిలిచిపోయే పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. వెంకటలక్ష్మి ఫంక్షన్‌హాలు పక్క నుంచి పెద్ద చెరువుకు వెళ్లే కాలవులన్నీ కప్పడంతో దిగువ ప్రాంతమైన సున్నంబట్టి వీధిలోకి నీరు చేరిపోతుందన్నారు. ఇంతటి దారుణ పరిస్థితి ఇక్కడున్నా అధికారులకు ప్రజల కష్టాలు కనిపించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు అందివ్వాలని బాబ్జీ కోరారు. ముంపు ప్రాంతాలు సందర్శించిన వారితో పార్టీ యువ ప్రతినిధి రమణ, స్థానిక యువత ఉన్నారు.

# ముంపు ప్రాంతాల్లో లోక్‌సత్తా పర్యటన



## శృంగవరపు కోట

వరదనీటి ముంపునకు గురైన స్థానిక శ్రీనివాస కాలనీ, గుర్రపు కోనేరు, ఎరుకుల పేట, గాంధీనగర్‌లో లోక్‌సత్తా పార్టీ నాయకులు పర్యటించారు. వరదనీటి ముంపునకు దారితీసిన పరిస్థితులను స్థానికులను అడిగితెలుసుకున్నారు. పుణ్యగిరి గెడ్డ అక్రమణాలకు గురికావడంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతుందని స్థానికులు వివరించారు. తహశీల్దార్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే వరి, చెరుకు, అరటి పంటలకు నష్టం జరిగినందున రైతులను ఆదుకోవాలని తహశీల్దార్ పి.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. పంటనష్టాన్ని అంచనా వేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గ నాయకుడు డి.సూర్యారావు, పీవీకృష్ణారావు, వసంత సత్యం, బోని దేముడు, బి.రామలక్ష్మీ తదితరులు ఉన్నారు.

---

# తాగునీరు సరఫరా చేయండి

## విజయనగరం

జిల్లా ఏర్పడ్డాక తాగునీరులేని గడ్డురోజులు ప్రజలు ఎన్నడూ చూడలేదని పట్టణమంతా మహిళలు నీరులేక గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని తక్షణమే పట్టణమంతా తాగునీరు వచ్చేటట్టు అధికారులు తగు చర్యలు చేపట్టాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం బాబ్జీ మాట్లాడుతూ గడిచిన వారం రోజులుగా పట్టణంలో ప్రజలు నీరు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పట్టణానికి ఎందుకు మంచినీరు రావడం లేదో, ఏం జరిగిందో ప్రజలకు తెలియజెప్పాలని కలెక్టర్‌ను కోరారు. పట్టణంలోని కణపాక, గుంటస్తంభం, కాంప్లెక్స్, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రాంతాలలో తాగునీరు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్‌ను



కలసిన వారిలో అనంతలక్ష్మీ, చింతలపూడి, పివీ రమణ, దయానంద్, కాశీపతి, విద్యాకృష్ణ పాల్గొన్నారు.

# ముంపు ప్రాంతాల్లో లోక్‌సత్తా బృందం పర్యటన



జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ముంపునకు గురైన ప్రాంతాల్లో జరిగిన నష్టం అధ్యయనానికి లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైడీ రామారావు సారథ్యంలోని బృందం తుని, గొల్లప్రోలు, అన్నవరం ప్రాంతాలను సందర్శించింది. తుని పట్టణంలో తాండవ నదికి వరద కట్ట నిర్మాణం చేపట్టకపోవడం వల్ల 1 నుంచి 10 వార్డుల్లోని 40 వేల మంది జనాభా తీవ్రంగా నష్టపోయి బాధలు పడుతున్నారని, వెంటనే వారికి నష్టపరిహారం చెల్లించి శాశ్వత పరిష్కారంగా నది ఒడ్డున కరకట్ట నిర్మించాలని రామారావు కోరారు. తాండవ, పంపానది, సీలేరు, సుద్దగడ్డ వాగుల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలన్నారు. ముంపునకు గురైన గొల్లప్రోలు ఈబీసీ కాలనీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ పర్యటనలో వైడీఆర్‌తో పాటు జిల్లా నాయకులు అడపా శంకర్, బీఎల్‌జీ ప్రసాద్, కొండేపూడి శంకరరావు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

**తూర్పుగోదావరి**

# ఎర్రన్నాయుడు దుర్మరణం పట్ల జేపీ తీవ్రదిగ్భ్రాంతి

తెదేపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి కె. ఎర్రన్నాయుడు రోడ్డుప్రమాదంలో దుర్మరణం చెందటం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఎర్రన్నాయుడు మృతి ఉత్తరాంధ్ర ప్రజాజీవితంలో పెద్ద వెలితి అని జేపీ అన్నారు. దివంగత నేత కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



### భౌతికకాయానికి నివాళులు

ఎర్రన్నాయుడు స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో ఆయన భౌతికకాయాన్ని లోక్‌సత్తా పార్టీ, యువసత్తా రాష్ట్ర నేతలు కటారి శ్రీనివాసరావు, భీశెట్టి బాబ్జీ, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, పి. రాంబాబు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఎర్రన్నాయుడు కుటుంబానికి తమ సంతాపాన్ని తెలియచేశారు.

# గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి



నీలం తుఫాన్ కారణంగా కురిసిన వర్షాల వల్ల గ్రామాలలో పారిశుధ్యం లోపించి విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని లోక్‌సత్తా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ భానుప్రసాద్ అన్నారు. పట్టణంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాదెండ్ల గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 80 మంది విషజ్వరాలకులోనై చికిత్స పొందుతున్నారని సమాచారం తెలియడంతో పార్టీ నాయకులు ఆసుపత్రిలోని రోగులను పరామర్శించారు. ఒక్క ఎస్సీ కాలనీలోనే సుమారు 80 మంది విషజ్వరాలకు లోనైతే అక్కడ పారిశుధ్య సమస్య ఏవిధంగా ఉందో అర్థమవుతుందని, దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మురికిపూడి ప్రసాద్, శ్రీనివాస్, ఖాదర్, కలి తదితరులు పాల్గొన్నారు.

**చిలకలూరిపేట**

---

# రైతులను ఆదుకోండి

**చిలకలూరిపేట**



నీలం తుఫాను బాధిత రైతులను ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదాసు భానుప్రసాద్ డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలసి ఎడ్లపాడు మండలం తుర్లపాడు, లింగారావుపాలెం తదితర గ్రామాల పొలాలను పరిశీలించారు. ఆయనతోపాటు పార్టీ నాయకులు పొంగులూరి హనుమంతరావు, భూషయ్య, శంకరరావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, మానుకొండ సాంబిరెడ్డి, తియ్యగూర కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# మగ్గాలు పరిశీలించిన లోక్‌సత్తా నాయకులు



తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చేనేత మగ్గాలలో నీరు చేరడంతో లోక్‌సత్తా నాయకులు పట్టణంలోని భావనా రుషినగర్‌లో పర్యటించి చేనేతలను పరామర్శించారు. మగ్గాలమీద ఉన్న చీరలు తడిసిపోయాయని లోక్‌సత్తా నాయకులకు తెలిపారు. పార్టీ ఇన్‌చార్జి మాదాసు భానుప్రసాద్ ఫోన్ ద్వారా విషయాన్ని తహశీల్దార్ ఫణీంద్రబాబుకు వివరించారు. నష్ట నివారణకు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు మురికిపూడి ప్రసాద్, ఖాదర్, చంద్రమౌళి, వెంకట్రావు, ఏకాంబరం పాల్గొన్నారు.

**చిలకలూరిపేట**





తణుకు సురాజ్య ఉద్యమంలో డి.వి.వి.యస్. వర్మ





హైదరాబాద్ ఐ.ఏ.ఎస్. స్టడీ సర్కిల్ లో పాల్గొన్న డా॥ జేపీ




హైదరాబాద్ బిగ్ ఎఫ్ఎంఎమ్ సేఫ్టీ రన్‌లో పాల్గొన్న కే.గీతామూర్తి



జూబ్లీహాల్‌లో ఆచార్య రంగాజీ 113వ జయంతి
కార్యక్రమంలో పాల్గొన్న జేపీ




వినుకొండలో అందరిచేత సురాజ్య ప్రతిజ్ఞ చేయిస్తున్న
సురాజ్య ఉద్యమ కమిటీ కన్వీనర్ పి. నరేష్‌బాబు



సురాజ్య ఉద్యమంలో భాగంగా
పత్తికొండలో విద్యార్థుల మానవహారం

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12




నెల్లూరు జిల్లా పొదలకూరులో మన ఊళ్లో సురాజ్యంలో విద్యార్థులు

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad